# హైదరాబాద్ పల్స్

జాతీయ తెలుగు దినపత్రిక

దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...

epaper.hyderabadpulsenews.in



విలేకరులు కావలెను

హైదరాబాద్ పల్స్ జాతీయ తెలుగు దినపత్రిక

"ఎంతకైనా తెగిస్తాం... ప్రజల గొంతుకై నిలుస్తాం" అనే నినాదంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన హైదరాబాడ్ పల్స్ జాతీయ దినపత్రికకు తెలుగు రాష్ట్రాలలోని అన్ని మండల, నియోజకవర్గాల, జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను. * సీనియర్లకు ప్రాధాన్యత కలదు.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్

- Dr. RAHUL KUMAR 9989834020

- K. Naveen Kumar 94406 53413

www.hyderabadpulse.com HyderabadPulse @hyderabad



సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 199 | పేజీలు : 08 | గురువారం | 30-07-2026 | వెల :4/-

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.


## మూడు నెలల బియ్యం ఒకేసారి పంపిణీ




- రేషన్‌కార్డ్‌దారులకు తీపికబురు చెప్పిన కేంద్రం
- ఆగస్టు 1 నుంచి 31 వరకు బియ్యం పంపిణీ పూర్తి చేసేందుకు ప్రణాళికలు
- బియ్యం పంపిణీతో ఇబ్బందులు పడుతామంటున్న డీలర్‌లు
- ఎల్‌నినో ప్రభావంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రం వెల్లడి



హైదరాబాద్ పల్స్, హైదరాబాద్ : రేషన్‌కార్డ్ లబ్ధిదారులకు కేంద్రప్రభుత్వం తీపికబురు చెప్పింది. మరోసారి మూడు నెలల బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేసేందుకు పౌరసరఫరాల శాఖ సన్నాహాలు చేస్తోంది. కేంద్రం ఆదేశాల మేరకు జాతీయ ఆహార భద్రతా చట్టం కింద అక్టోబర్ వరకు కేటాయించిన ఆహార ధాన్యాలు ముందుగా అందజేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తోంది. ఆగస్టు 1వ తేదీ నుంచి ప్రారంభించి 31వ తేదీ వరకు ఈ ప్రక్రియను పూర్తి చేసేందుకు ఇప్పటికే చౌక ధరల దుకాణాలకు బియ్యం సరఫరాకు వ్యూహాలు రచిస్తోంది. ఒకే నెలలో మూడు మాసాల కోటా పంపిణీ చేయాలంటే తాము తీవ్ర ఒత్తిళ్లు, సాంకేతిక సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని రేషన్ డీలర్లు ఆందోళన చెందుతున్నారు.

**మూడు నెలల రేషన్ బియ్యం ఒకేసారి పంపిణీ**

ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలల రేషన్ బియ్యం ఒకేసారి పంపిణీ చేయాలని కేంద్రం ప్రభుత్వం నిర్ణయించింది. పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో ఏప్రిల్, మే, జూన్ మాసాలకు సంబంధించిన రేషన్ బియ్యం లబ్ధిదారులకు ఒకేసారి కేంద్రం పంపిణీ చేసిన విషయం తెలిసిందే. తాజాగా సూపర్ ఎల్‌నినో ద్వారా ఉత్పన్నమైన తీవ్ర వర్షాభావం, ప్రతికూల వాతావరణ పరిస్థితులు, గోదాముల్లో పేరుకుపోయిన నిల్వలు వంటి సవాళ్ల నేపథ్యంలో ఒకేసారి మూడు నెలల కోటా ఇవ్వాలని కేంద్ర సర్కార్ నిర్ణయించింది.

**మూడు విడతల్లో బియ్యాన్ని చేరవేసేలా**

రాష్ట్రంలో ఉన్న 1.06 కోట్ల రేషన్ కార్డుల ద్వారా 3.42 కోట్ల మంది లబ్ధిదారులకు 2.15 లక్షల

---

సింగరేణి అస్తిత్వం

## ప్రమాదంలో పడింది



- రేవంత్, కిషన్ రెడ్డి కారణంగా సింగరేణి అస్తిత్వం ప్రమాదంలో పడింది: కవిత
- సింగరేణికే బొగ్గు బ్లాకులు కేటాయించాలనే విన్నపాలను పట్టించుకోవడం లేదన్న కవిత
- టీఎస్ జెన్‌కోను రంగంలోకి దింపడం వెనుక మర్మం ఏమిటని ప్రశ్న
- ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు డ్రామా ఆడుతున్నారని విమర్శ

2

హైదరాబాద్ పల్స్, హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిల తీరు వల్ల తెలంగాణకే గర్వకారణమైన సింగరేణి సంస్థ తన అస్తిత్వాన్ని, ఉనికిని కోల్పోయే ప్రమాదంలో పడిందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

---

### బంగాళాఖాతంలో మునిగిన వాళ్లే హైడ్రాను ముంచుతామంటారా?'.. కేటీఆర్‌పై తుమ్మల సెటైర్

హైదరాబాద్ పల్స్, హైదరాబాద్

హైడ్రాపై మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. బంగాళాఖాతంలో మునిగిపోయిన వాళ్లే హైడ్రాను

---



రాష్ట్రంలో 4 ఇండస్ట్రియల్

## పార్కులు

కేంద్రానికి ప్రతిపాదనలు

హైదరాబాద్ పల్స్, హైదరాబాద్

భారత్ ఔద్యోగిక్ వికాస్ యోజన (భవ్య) పథకం కింద రాష్ట్రంలో నాలుగు ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలు కేంద్ర ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు వెల్లడించారు. ఈ మేరకు బుధవారం

---

### కాళేశ్వరం నుంచి నీటి చుక్క వాడకుండా అత్యధిక ధాన్యం పండించిన తెలంగాణ: ఉత్తమ్



హైదరాబాద్ పల్స్, హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీటి చుక్క కూడా వాడకుండా భారతదేశంలోనే అత్యధికంగా

---

## పీఓకేలో రక్తపాతం..

**పాక్ బలగాల దాడిలో 40 మంది మృతి**

- పీఓకేలో పాక్ సైన్యం దమనకాండ
- గత రెండు రోజుల్లో 40 మంది పౌరులు మృతి
- ఇది మారణకాండ అంటున్న స్థానిక నేతలు
- జూన్ నుంచి 100 మందికి పైగా హతమయ్యారని ఆరోపణ
- అంతర్జాతీయ సమాజం జోక్యం చేసుకోవాలని డిమాండ్

2




హైదరాబాద్ పల్స్,డెస్క్

పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లో పరిస్థితి తీవ్ర ఉద్రిక్తంగా మారింది. అక్కడ నిరసనలు తెలుపుతున్న పౌరులపై పాకిస్థాన్ బలగాలు

---

## పని మాది.. ప్రచారం చంద్రబాబుది

- భోగాపురం విమానాశ్రయం క్రెడిట్ తన ఖాతాలోకి వేసుకునేందుకు చంద్రబాబు యత్నిస్తున్నారన్న జగన్
- విమానాశ్రయానికి సంబంధించిన అన్ని పనులు తమ హయాంలోనే జరిగాయని వ్యాఖ్య
- 2026 నాటికి విమాన రాకపోకలు మొదలవుతాయని అప్పుడే ప్రకటించామన్న జగన్



---

కేసును శాశ్వతంగా

## క్లోజ్ చేసిన సుప్రీంకోర్టు

**మన్మోహన్ సింగ్ పై ఉన్న క్రిమినల్ కేసును శాశ్వతంగా క్లోజ్ చేసిన సుప్రీంకోర్టు**

**బొగ్గు గనుల కేటాయింపు వ్యవహారంలో మన్మోహన్ పై కేసు**

**సీబీఐ నివేదికను పక్కన పెట్టి ట్రయల్ కోర్టు సమన్లు జారీ చేయడంలో బలమైన కారణాలు కనిపించడం లేదన్న సుప్రీంకోర్టు**

**ట్రయల్ కోర్టు ఉత్తర్వులను కొట్టివేసిన సర్వోన్నత న్యాయస్థానం**



బొగ్గు గనుల కేటాయింపు వ్యవహారంలో దివంగత మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్‌పై నమోదైన క్రిమినల్ కేసును, ఆనాటి ప్రత్యేక

---

## వేధింపులు ఆగకపోతే మళ్లీ ఉద్యమం

**ప్రభుత్వం సిగ్గుపడాలి..విద్యార్థులపై వేధింపులు ఆగకపోతే మళ్లీ ఉద్యమం : అభిజిత్ దిప్కే**

**విద్యార్థులపై బలప్రయోగం సిగ్గుచేటని కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డ అభిజిత్ దిప్కే**

**'ఛలో సంసద్' నిరసనల సమయంలో కనిపించిన ట్రక్కుపై స్పష్టత ఇచ్చిన ఢిల్లీ పోలీసులు**

2

హైదరాబాద్ పల్స్,డెస్క్

నీట్ యూజీ 2026 ప్రశ్నాపత్రం లీక్ వ్యవహారంపై నిరసనలు తెలిపిన విద్యార్థులపై ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలు వెంటనే నిలిపివేయాలని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) డిమాండ్ చేసింది. ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోకపోతే త్వరలోనే మరోసారి దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని ప్రారంభిస్తామని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే హెచ్చరించారు. ఢిల్లీ విమానాశ్రయం వద్ద బుధవారం మీడియాతో మాట్లాడుతూ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. తమ భవిష్యత్తు, హక్కుల కోసం శాంతియుతంగా నిరసన తెలిపిన విద్యార్థులపై లాఠీచార్జ్, పెలెట్ గన్స్ వంటి చర్యలు తీసుకోవడం తీవ్రంగా ఖండించారు.

**'విద్యార్థులు ఉగ్రవాదులా?'**

జులై 20న జరిగిన నిరసనల సందర్భంగా విద్యార్థులపై బలప్రయోగం జరిగిందని అభిజీత్ దీప్కే ఆరోపించారు. వారిని ఉగ్రవాదుల మాదిరిగా పెల్లెట్ గన్స్?తో లక్ష్యంగా చేసుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. ప్రభుత్వం ఇలాంటివి చేయకూడదని, విద్యార్థులు తమ భవిష్యత్, హక్కుల కోసం పోరాడుతున్నారని అన్నారు. వారిపై ఇలాంటి చర్యలు తీసుకోవడం తగదని తెలిపారు. ఇలాగే వేధించడం కొనసాగిస్తే మళ్లీ ప్రజల్లోకి వెళ్లి ఉద్యమం



---

## పేపర్ లీక్‌లపై ఉక్కుపాదం..

**లోక్‌సభలో పరీక్షల సవరణ బిల్లుకు ఆమోదం**

- పబ్లిక్ పరీక్షల సవరణ బిల్లు 2026కు లోక్‌సభ ఆమోదం
- పరీక్షల అక్రమాలకు పాల్పడితే 10 ఏళ్ల జైలు, రూ.10 కోట్ల వరకు జరిమానా
- ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ఏర్పాటు.. మూడు నెలల్లోగా తీర్పునకు నిబంధన
- నీట్ పేపర్ లీక్‌పై విద్యార్థుల నిరసనలు, మంత్రి రాజీనామా నేపథ్యంలో ఈ పరిణామం
- పరీక్షల వ్యవస్థలో పారదర్శకత పెంచడమే లక్ష్యమని ప్రభుత్వం వెల్లడి

2

హైదరాబాద్ పల్స్,డెస్క్

దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసిన పరీక్షల పేపర్ లీకేజీలు, అక్రమాలపై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలకు సిద్ధమైంది. ఇందులో భాగంగా 'పబ్లిక్ పరీక్షల సవరణ బిల్లు-2026'కు లోక్‌సభ బుధవారం ఆమోదముద్ర వేసింది. రెండు రోజుల పాటు వాడివేడిగా సాగిన చర్చల అనంతరం వాయిస్ ఓటు ద్వారా ఈ కీలక బిల్లును సభ ఆమోదించింది. పరీక్షల వ్యవస్థలో పారదర్శకతను



## సింగరేణి అస్తిత్వం ప్రమాదంలో పడింది

మొదటి పేజీ రువాయి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిల తీరు వల్ల తెలంగాణకే గర్వకారణమైన సింగరేణి సంస్థ తన అస్తిత్వాన్ని, ఉనికిని కోల్పోయే ప్రమాదంలో పడిందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బహిరంగ వేలం ద్వారా కాకుండా నేరుగా సింగరేణి సంస్థకే బొగ్గు బ్లాకులను కేటాయించాలన్న విజ్ఞప్తులను పట్టించుకోకుండా... మణుగూరు పీకేవోసీపీ బొగ్గు బ్లాక్ వేలం నిర్వహించడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని ఆమె ఆరోపించారు.సింగరేణి నేరుగా వేలంలో పాల్గొంటుందని పైకి ప్రకటించిన ప్రభుత్వం, తెరవెనుక మాత్రం టీఎస్ జెన్‌కోను పోటీలోకి తెచ్చేలా కుట్రపూరిత ప్రయత్నాలు చేస్తోందని కవిత మండిపడ్డారు. బొగ్గు తవ్వకాల్లో శతాబ్దాల అనుభవం, ప్రావీణ్యం ఉన్న సింగరేణి సంస్థకు పోటీగా.. ఎలాంటి అనుభవం లేని టీఎస్ జెన్‌కోను రేసులోకి దింపడం వెనుక ఉన్న మర్మమేమిటో రేవంత్ రెడ్డి స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.జెన్‌కో ద్వారా బొగ్గు బ్లాకులను దక్కించుకుని, ఆ తర్వాత అనుభవం లేదనే నెపంతో వాటిని ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు ఈ ముసుగు డ్రామా ఆడుతున్నారని ఆమె ధ్వజమెత్తారు. సింగరేణి భవిష్యత్తు, అభివృద్ధిపై కిషన్ రెడ్డికి నిజంగానే చిత్తశుద్ధి ఉంటే, వేలం ప్రక్రియతో సంబంధం లేకుండా నేరుగా కేటాయింపులు జరపాలని డిమాండ్ చేశారు. వెంటనే ఈ వేలం పోటీ నుంచి టీఎస్ జెన్‌కోను రాష్ట్ర ప్రభుత్వం తప్పించాలని డిమాండ్ చేశారు.

## పీఓకేలో రక్తపాతం..

మొదటి పేజీ రువాయి

జరిపిన దమనకాండలో గత రెండు రోజుల్లో కనీసం 40 మంది ప్రాణాలు కోల్పోయారు. డజన్ల కొద్దీ ప్రజలు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రాంతంలో తీవ్ర అశాంతి నెలకొన్న నేపథ్యంలో పాక్ సైన్యం విచక్షణారహితంగా వ్యవహరిస్తోందని స్థానిక సంఘాలు ఆరోపిస్తున్నాయి.'యునైటెడ్ కశ్మీర్ పీపుల్స్ నేషనల్ పార్టీ' (యూకేపీఎన్‌పీ) ఈ ఘటనలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నెల 27, 28 తేదీల్లో రావల్‌కోట్, మీర్పూర్ సహా పలు ప్రాంతాల్లో పాక్ బలగాలు జరిపిన దాడుల్లో 40 మంది పౌరులు మరణించారని, వందలాది మందిని అక్రమంగా అరెస్టు చేశారని ఆరోపించింది. అంతేకాకుండా జూన్ 5 నుంచి ఇప్పటివరకు 100 మందికి పైగా పౌరులను పాక్ సైన్యం చంపేసిందని, వందల మందిని బలవంతంగా అదృశ్యం చేసిందని పేర్కొంది.ఇదిలా ఉండగా, జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ (జేఏఏసీ) నేత సర్దార్ అమ్మాన్ ఖాన్ కూడా పాక్ సైన్యంపై విరుచుకుపడ్డారు. ఇది నిరాయుధులైన పౌరులపై జరిగిన 'మారణకాండ' అని ఆయన అభివర్ణించారు. "కేవలం రెండు రోజుల్లోనే పాక్ బలగాలు 38 మంది శాంతియుత నిరసనకారులను అత్యంత కిరాతకంగా చంపేశాయి" అని ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.పీఓకేలో కొనసాగుతున్న ఈ నిరసనలు, ఇస్లామాబాద్ నియంత్రణకు ప్రత్యక్ష సవాలుగా మారాయి. ఈ ఘటనలపై ఐక్యరాజ్యసమితి, యూరోపియన్ యూనియన్ తక్షణమే స్పందించి, స్వతంత్ర దర్యాప్తునకు ఆదేశించాలని, పౌరులను రక్షించాలని యూకేపీఎన్‌పీ డిమాండ్ చేసింది. ప్రస్తుతం పీఓకేలోని చాలా ప్రాంతాల్లో కమ్యూనికేషన్ వ్యవస్థలను పూర్తిగా నిలిపివేసి, కర్ఫ్యూ వాతావరణం విధించారు.

## మూడు నెలల బియ్యం ఒకేసారి పంపిణీ

మొదటి పేజీ రువాయి

మెట్రిక్ టన్నులు పైగా బియ్యం పంపిణీ చేయనున్నారు. మండల స్థాయి స్టాక్ పాయింట్లు నుంచి షాపులకు ఎలాంటి రవాణా ఇబ్బందులు లేకుండా చిన్న దుకాణాలకు ఒకేసారి పెద్ద షాప్‌లకు రెండు లేదా మూడు విడతల్లో బియ్యాన్ని చేరవేసేలా చూస్తున్నారు. ఆగస్టు 1 నుంచి మూడు నెలల రేషన్ బియ్యాన్ని ఒకేసారి విడుదల చేస్తుండటంతో తమకు శ్రమ, ఒత్తిడి, కూలీల కొరత అధికమవుతుందని డీలర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**పంపిణీ విజయవంతం చేస్తాం**

రేషన్ బియ్యం పొందడానికి ఈ-కేవైసీ అప్‌డేట్ చేసుకోవడం తప్పనిసరిగా మారింది. ఈ అంశం పూర్తయితేనే రేషన్ అందేలా జాతీయ సమాచార వ్యవస్థ తమ సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేసింది. కేంద్రం గత రెండేళ్లుగా ప్రచారం చేస్తున్నప్పటికీ ఇంకా 39 శాతం ఈ-కేవైసీ చేయించుకోకపోవడంతో గ్రామీణ స్థాయిలో ప్రచారం కల్పించి 100 శాతం పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. పౌరసరఫరాల శాఖకు సహకరించి 3 నెలల 1బియ్యం పంపిణీ విజయవంతం చేస్తామని రాష్ట్ర రేషన్ దుకాణాల డీలర్‌ల సంఘం ప్రకటించింది.

**ఈ-కేవీసీ చేయించుకోని పక్షంలో**

లబ్ధిదారులు మూడు నెలల కోటా కోసం ఎలక్ట్రానిక్ పాయింట్ యంత్రంలో నిబంధనల ప్రకారం వేలిముద్రలు వేయాల్సి ఉంటుంది. కానీ, ఎవరైనా ఈ-కేవీసీ చేయించుకోని పక్షంలో చేయించుకోకపోయినట్లయితే ఆ రేషన్ కార్డు ఆగిపోవడం లేదా, తొలగించే అవకాశం ఉంటుందని తెలుస్తుంది.



## పని మాది.. ప్రచారం చంద్రబాబుది

మొదటి పేజీ రువాయి

భోగాపురం విమానాశ్రయాన్ని తన ఖాతాలో వేసుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు దొంగ దారులు వెతుకుతున్నారని, కిరీటం వేసుకోవడంలో ఆయన చూపే శ్రద్ధ అభివృద్ధిలో చూపరని వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం త్వరలోనే ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభానికి సిద్ధమవుతున్న నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.సోషల్ మీడియా వేదికగా జగన్ స్పందిస్తూ... "2019 ఎన్నికలకు సరిగ్గా నెల రోజుల ముందు ఎలాంటి అనుమతులు లేకుండా కేవలం ఒక శంకుస్థాపన రాయి వేసి ముచ్చట తీర్చుకోవడం తప్ప చంద్రబాబు చేసిందేమీ లేదు. కానీ 2020లో జీఎంఆర్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకోవడం నుంచి భూసేకరణ, భద్రతా అనుమతులు, మౌలిక సదుపాయాల కల్పన వరకు ప్రతీదీ వైసీపీ ప్రభుత్వ హయాంలోనే రూపుదిద్దుకున్నాయి" అని స్పష్టం చేశారు.ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న భూసేకరణను పూర్తి చేసి నిర్వాసితులకు పునరావాసం కల్పించడంతో పాటు నీరు, విద్యుత్, రోడ్ల కనెక్టివిటీ కోసం తమ ప్రభుత్వం ఏకంగా రూ.1200 కోట్లు ఖర్చు చేసిందని జగన్ అన్నారు. కోవిడ్ సంక్షోభం ఎదురైనా రన్‌వే, టెర్మినల్ పనులను వేగవంతం చేసి 2026 నాటికే విమానాల రాకపోకలు మొదలవుతాయని అప్పుడే ప్రకటించామని చెప్పారు. తాము పడ్డ కష్టానికి ఇప్పుడు ఫలాలు అందుతుంటే... ఏమీ చేయని చంద్రబాబు దొంగ క్రెడిట్ కొట్టేసేందుకు శాయశక్తులా తాపత్రయపడుతున్నారని ధ్వజమెత్తారు.

## పేపర్ లీక్‌లపై ఉక్కుపాదం..

మొదటి పేజీ రువాయి

పెంచడం, విద్యార్థుల భవిష్యత్తును కాపాడటమే లక్ష్యంగా ఈ చట్టాన్ని తీసుకొచ్చినట్లు ప్రభుత్వం తెలిపింది.2024 నాటి చట్టానికి సవరణలు చేస్తూ రూపొందించిన ఈ కొత్త బిల్లులో అత్యంత కఠినమైన నిబంధనలను చేర్చారు. దీని ప్రకారం పరీక్షల నిర్వహణలో అక్రమాలకు పాల్పడినట్లు రుజువైతే దోషులకు గరిష్ఠంగా 10 సంవత్సరాల వరకు జైలు శిక్ష, రూ.10 కోట్ల వరకు జరిమానా విధించే అవకాశం ఉంది. అంతేగాక దోషుల ఆస్తులను జప్తు చేసే అధికారాన్ని కూడా ఈ చట్టం కల్పిస్తుంది. ఈ తరహా కేసుల విచారణను వేగవంతం చేసేందుకు ప్రత్యేకంగా ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయనున్నారు. ఈ కోర్టులు మూడు నెలల వ్యవధిలోనే విచారణ పూర్తి చేసి తీర్పు వెలువరించాల్సి ఉంటుంది.ఇటీవల నీట్ పేపర్ లీక్ వ్యవహారం దేశవ్యాప్తంగా పెను దుమారం రేపిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే పేపర్ లీక్‌లకు వ్యతిరేకంగా కఠినమైన చట్టం తీసుకువస్తామని ప్రధాని నరేంద్ర మోదీ హామీ ఇచ్చారు. ఆ తర్వాత కేంద్ర క్యాబినెట్ ఆమోదించిన ఈ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టారు.నీట్ అక్రమాలు, ఇతర పరీక్షల్లో అవకతవకాలపైన జులై 20న 'కాక్‌రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) ఆధ్వర్యంలో ఢిల్లీలో 'సంసద్ చలో' పేరిట వందలాది మంది విద్యార్థులు భారీ నిరసన చేపట్టారు. ఈ ఆందోళన హింసాత్మకంగా మారడంతో పోలీసులు, నిరసనకారుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ పరిణామాల నేపథ్యంలో నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ జులై 25న తన పదవికి రాజీనామా చేశారు. ఈ రాజకీయ ఒత్తిడి, దేశవ్యాప్త నిరసనల నేపథ్యంలో ప్రభుత్వం ఈ కఠిన చట్టాన్ని తీసుకురావడం గమనార్హం.

## కాళేశ్వరం నుంచి నీటి చుక్క వాడకుండా అత్యధిక ధాన్యం పండించిన తెలంగాణ: ఉత్తమ్

మొదటి పేజీ రువాయి

ధాన్యం పండించిన రాష్ట్రం తెలంగాణ అని భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. న్యూఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన బుధవారం మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ కట్టిన వారం రోజుల్లోనే లీక్ అయిందన్నారు. ఈ విషయం బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కి కూడా తెలుసునని పేర్కొన్నారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమణారెడ్డి సహా అధికారులపై చర్యలు తీసుకోవాలని చెప్పినా పట్టించుకోలేదని అన్నారు. సుమారు మూడేళ్లుగా నిరుపయోగంగా ఉన్న ప్రాజెక్టుకు రూ.16 వేల కోట్ల వడ్డీ రూపంలో కడుతున్నామని వివరించారు. కాళేశ్వరంపై బీఆర్ఎస్ పార్టీ పిచ్చి రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. కానీ ఆ ప్రాజెక్ట్‌తో తాము అలాంటి రాజకీయాలు చేయడం లేదన్నారు.బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ బాధ్యత లేకుండా మాట్లాడడం దురదృష్టకరమని అన్నారు. ఇసుకలో కాళేశ్వరం ఫౌండేషన్ వేశారని గుర్తు చేశారు. ఐఐటీ బాంబే ఆఫ్‌ కంపెనీతో సాయిల్ టెస్ట్ చేయించామని పేర్కొన్నారు. బ్యారేజీలు ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్నాయని.. అంటే అది ఓపెన్ చేస్తే ప్రజలకు ఏమైనా అయితే ప్రభుత్వం బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. బీఆర్ఎస్ పార్టీ కక్కుర్తి, అసమర్థత వలన కాళేశ్వరం కూలిపోయిందని విమర్శించారు. అయితే కాళేశ్వరం విషయంలో తమకు రాజకీయ దురుద్దేశం లేదని స్పష్టం చేశారు.కాళేశ్వరం విషయంలో బిఆర్ఎస్ పార్టీ బూటకపు ప్రచారం చేస్తుందని ఆరోపించారు. మేడిగడ్డ బ్యారేజ్ నుంచి కన్నెపల్లి పంపు హౌస్‌కు18 కిలోమీటర్ల దూరం ఉందన్నారు. అన్నారం బ్యారేజ్‌కి రంధ్రాలు ఉన్నాయని సీ డబ్లు పీ ఆర్ ఎస్ రిపోర్ట్ ఇచ్చిందని గుర్తు చేశారు. ఎన్ డి ఎస్ ఏ మొదట ప్రిలిమినరీ రిపోర్ట్ నవంబర్ 23 ఇచ్చిందని అన్నారు. కమీషన్ల కోసం ఫౌండేషన్ చూసుకోకుండా కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మించారని మండిపడ్డారు. బీఆర్ఎస్‌కు రూ. 1400 కోట్లు కాళేశ్వరం కాంట్రాక్టర్లు చెక్ రూపంలో ఇచ్చారని కల్వకుంట కవిత చెప్పారని..అది వాస్తవమని పేర్కొన్నారు.తనకు తెలిసి తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క ప్రాజెక్టు కూడా మేఘా సంస్థకు ఇవ్వలేదన్నారు. ఎన్డీఎస్ఏ ఇచ్చిన రిపోర్ట్ ఆధారంగా సీబీఐకి లేఖ రాశామని చెప్పారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి 24 గంటల్లో సీబీఐ విచారణ జరిపిస్తామని ప్రకటించారని గుర్తు చేశారు. ధాన్యం కుంభకోణం చేసిన వారిని అరెస్ట్ చేస్తామన్నారు. ఎస్ ఎల్ బిసి టన్నులు తమ హయంలో పూర్తి చేసి ఎన్నికలకు వెళ్తామని ఉత్తమ్ కు ఎల్ బిసి మార్ రెడ్డి ప్రకటించారు.

## కేసును శాశ్వతంగా క్లోజ్ చేసిన సుప్రీంకోర్టు

మొదటి పేజీ రువాయి

కోర్టు జారీ చేసిన సమన్ల ఉత్తర్వులను సుప్రీంకోర్టు ఈరోజు పూర్తిగా రద్దు చేసింది. విచారణ సంస్థల ఆధారాలను తోసిపుచ్చి స్పెషల్ కోర్టు జారీ చేసిన ఉత్తర్వులను కొట్టివేస్తూ కేసును క్లోజ్ చేసింది.భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ కీలక తీర్పును వెలువరించింది. ఈ కేసుకు సంబంధించి సీబీఐ దాఖలు చేసిన రెండు విభిన్న క్లోజర్ రిపోర్టుల్లో మన్మోహన్ సింగ్‌కు క్లీన్ చిట్ ఇచ్చిందని, అయినప్పటికీ ట్రయల్ కోర్టు సీబీఐ నివేదికను పక్కనబెట్టి సమన్లు జారీ చేయడంలో ఎలాంటి బలమైన కారణాలు కనిపించడం లేదని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

**కేసు నేపథ్యం**

2005లో ఒడిశాలోని తలబిరా-II బొగ్గు బ్లాక్ కేటాయింపుల విషయంలో అక్రమాలు జరిగాయనే ఆరోపణలతో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, ప్రముఖ పారిశ్రామికవేత్త కుమార మంగళం బిర్లా, మాజీ బొగ్గు శాఖ కార్యదర్శి పి.సి. పరాఖ్‌లకు 2015లో నాటి ప్రత్యేక కోర్టు సమన్లు జారీ చేసింది.ఈ ఉత్తర్వులను మన్మోహన్ సింగ్ సుప్రీంకోర్టులో సవాలు చేయగా, అత్యున్నత న్యాయస్థానం ఆనాడే సమన్ల అమలుపై స్టే విధించింది. ప్రధానిగా తన విధుల్లో భాగంగా నిర్ణయం తీసుకున్నానని, ఇందులో ఎలాంటి నేరపూరిత ఉద్దేశం లేదని మన్మోహన్ సింగ్ స్పష్టం చేశారు. తాజాగా సీబీఐ అందించిన క్లోజర్ రిపోర్టును ఆమోదిస్తూ సుప్రీంకోర్టు తుది తీర్పునివ్వడంతో మాజీ ప్రధానిపై ఉన్న ప్రధాన ఆరోపణలు తొలగిపోయాయి.

## వేధింపులు ఆగకపోతే మళ్లీ ఉద్యమం

మొదటి పేజీ రువాయి

చేపడతామని స్పష్టం చేశారు. మరోసారి ఆందోళన చేపడతారా? అనే ప్రశ్నకు స్పందించిన దిప్కే, ప్రభుత్వం తన తీరును మార్చుకోకపోతే తప్పకుండా మరో ఉద్యమం ఉంటుందని చెప్పారు. అది త్వరలోనే ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. జెన్-జెడ్ యువతపై బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ చేసిన వ్యాఖ్యలపై దిప్కే స్పందించారు. ఆమె వ్యాఖ్యలను ఎవరు సీరియస్‌గా తీసుకుంటారని కొట్టిపారేశారు.

**అవన్నీ అవాస్తవం : దిల్లీ పోలీసులు**

మరోవైపు జంతర్‌మంతర్ వద్ద ఇటీవల జరిగిన సీజేపీ నిరసనలు, చలో సంసద్ సందర్భంగా రాళ్లతో నిండిన ట్రక్కు కనిపించడంపై దిల్లీ పోలీసులు క్లారిటీ ఇచ్చారు. సోషల్? మీడియాలో వైరల్ అవుతున్న ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. ఆ లారీకి నిరసన కార్యక్రమాలతో ఎలాంటి సంబంధం లేదన్నారు. ఆ ఆరోపణలు పూర్తిగా అవాస్తవం అని, ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని అన్నారు. వాటికి ఎలాంటి ఆధారాలు లేవని స్పష్టం చేశారు.పోలీసులు వెల్లడించిన వివరాలు ప్రకారం, వివాదాస్పదంగా మారిన ట్రక్కును జులై 16న జరిగిన ఓ రోడ్డు ప్రమాదం కేసులో స్వాధీనం చేసుకున్నారు. ఈఈసీఓ వ్యాన్‌ను ట్రక్కు ఢీకొనడం వల్ల ఆరుగురు గాయపడినట్లు తెలిపారు. ఈ ఘటనపై పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నంబర్ 65/2026 నమోదు చేసి, దర్యాప్తులో భాగంగా ట్రక్కును పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నట్లు వివరించారు. స్వాధీనం చేసుకున్న ట్రక్కును చట్టపరమైన ప్రక్రియలో భాగంగా, భద్రత దృష్ట్యా మొదట సంసద్ మార్గ్ పోలీస్ స్టేషన్ సమీపంలో నిలిపినట్లు పోలీసులు తెలిపారు. పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో తగినంత స్థలం లేకపోవడం వల్ల తాత్కాలికంగా బయట పార్క్ చేసినట్లు పేర్కొన్నారు.

**రాజకీయ రంగు పులమడం సరికాదన్న పోలీసులు**

'ఛలో సంసద్' కార్యక్రమం సందర్భంగా భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్? సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకుని జులై 20 తెల్లవారుజామునే ట్రక్కును అక్కడి నుంచి తరలించాలని నిర్ణయించినట్లు దిల్లీ పోలీసులు వెల్లడించారు. అయితే తరలించే ముందు లారీలో ఉన్న రాళ్లను పూర్తిగా ఖాళీ చేసి, యజమానికి అవసరమైన సూచనలు ఇచ్చిన అనంతరమే, వాహనాన్ని మరో సురక్షిత ప్రాంతానికి తరలించినట్లు స్పష్టం చేశారు. ఇది పూర్తిగా చట్టపరమైన, పరిపాలనా ప్రక్రియలో భాగంగా జరిగిన చర్య మాత్రమేనని, దీనికి నిరసనలు లేదా ఏదైనా కుట్రతో సంబంధం ఉందని ప్రచారం చేయడం పూర్తిగా అవాస్తవమని దిల్లీ పోలీసులు పేర్కొన్నారు. ఈ ఘటనకు రాజకీయ రంగు పులమడం సరికాదని స్పష్టం చేశారు.

## బంగాళాఖాతంలో మునిగిన వాళ్లే హైడ్రాను ముంచుతామంటారా?'

మొదటి పేజీ రువాయి

బంగాళాఖాతంలో వేస్తామంటే అర్థం లేదంటూ సెటైర్ విసిరారు. వర్షాకాలం వచ్చినా ఇప్పటికీ 30 శాతం లోటు వర్ష పాతం నమోదైందని తెలిపారు. 150 ఏళ్ల నుంచి చూడని ప్రకృతి వైపరీత్యం వచ్చిందన్నారు. ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్‌లో కూడా తీవ్ర ఎల్‌నినో ప్రభావం ఉంటుందని చెప్పుకొచ్చారు. ప్రకృతి వైపరీత్యాన్ని గ్రామగ్రామాన ప్రజలకు తెలియజేస్తున్నామని తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో పని చేస్తున్నామన్నారు.రైతులు మెట్ట పంటలు వేస్తున్నారని మంత్రి తెలిపారు. ఆయిల్ పామ్ వైపు ఎక్కువగా రైతులు మొగ్గుచూపుతున్నారని, ఇది మంచి శుభపరిణామమని అన్నారు. గాంధీ భవన్‌ను దేవాలయంగా భావించి నమ్మకంతో ప్రజలు సమస్యలు చెప్పుకోవడానికి వస్తున్నారన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను సంబంధిత అధికారులకు పంపిస్తున్నామని తెలిపారు. ఏ పార్టీ నిర్వహించని ముఖాముఖిని కాంగ్రెస్ నిర్వహిస్తోందన్నారు. కలెక్టర్లతో మాట్లాడి సమస్యలను పరిష్కారం చేస్తున్నామని చెప్పారు. సంబంధిత శాఖ అధికారులకు పంపిస్తూ రిపోర్ట్ అడుగుతున్నామన్నారు. ముఖాముఖి నిర్వహిస్తున్న పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ధన్యవాదాలు తెలియజేశారు.

## రాష్ట్రంలో 4 ఇండస్ట్రియల్ పార్కులు

మొదటి పేజీ రువాయి

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సంబంధిత ఉన్నతాధికారులతో సిఎస్ సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, పరిశ్రమలు-వాణిజ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, చేనేత-పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, సిక్తా పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.సమావేశం అనంతరం సిఎస్ సంజయ్ జాజు మాట్లాడుతూ, భవ్య పథకం మొదటి దశలో భాగంగా రాష్ట్రంలో ఏర్పాటు చేయనున్న నాలుగు ఇండస్ట్రియల్ పార్కుల పూర్తి ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్)ను ఈ నెలాఖరులోగా కేంద్రానికి అందజేస్తామని తెలిపారు.ప్రతి పార్కు 500 ఎకరాలకు మించి విస్తీర్ణంలో ఉంటాయని, ఇందుకు సంబంధించి భూసేకరణ, ఇతర ఏర్పాట్లన్నీ పూర్తి చేశామని స్పష్టం చేశారు. ఈ పార్కులు కందుకూరు మండలం తిమ్మాపూర్, ఇబ్రహీంపట్నం మండలం ఎలిమినేడు, ఘట్కేసర్ మండలం మాదారం, చౌటుప్పల్ మండలం దండు మైలారం ప్రాంతాల్లో ఏర్పాటవుతాయని వివరించారు.ఈ పార్కుల్లో ఎలక్ట్రానిక్స్, సాఫ్ట్‌వేర్ తదితర రంగాల పరిశ్రమల ఏర్పాటుకు పలు ప్రముఖ కంపెనీలు ఆసక్తి చూపాయని సిఎస్ తెలిపారు. ఇవి కాకుండా మరో 16 ప్రాంతాల్లో ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందిస్తున్నట్లు సంజయ్ జాజు వెల్లడించారు.

# దైవ స్వరూపమే గురువు..!

- దత్తగిరి ఆశ్రమ పీఠాధిపతులు
- వైభవంగా గురు పౌర్ణమి వేడుకలు
- వేలాదిగా హాజరైన భక్తులు
- పీఠాధిపతులకు తులాభారం, రథోత్సవం

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 29, జహీరాబాద్ :** అజ్ఞానాంధకారాన్ని తొలగించి జ్ఞానజ్యోతిని వెలిగించే దైవస్వరూపమే గురువు. జీవితానికి దిశానిర్దేశం చేస్తూ ధర్మమార్గంలో నడిపించే వారే గురువులని బర్దిపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్రమ పీఠాధిపతులు శ్రీ శ్రీ శ్రీ 1008 వైరాగ్య శిఖామణి అవధూత గిరి మహారాజ్, మహామండలేశ్వర్ డా. సిద్ధేశ్వరానంద గిరి మహారాజ్ తెలిపారు. బుధవారం గురు పౌర్ణమి సందర్భంగా ఉదయం గోపూజ, వేద విద్యార్థులచే తల్లిదండ్రులకు పాదపూజ, గురు చరిత్ర పారాయణం, రుద్ర సహిత దత్త యజ్ఞం, అవధూత గిరి మహారాజ్ వారికి రథోత్సవం, రుద్రాక్ష మాలలతో తులాభారాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మాజీ కేంద్ర మంత్రి భగవంత్ ఖూబా, జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీ పాటిల్, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ సునీత హనుమంతరావు పాటిల్తో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు గురుపాద పూజలో పాల్గొని గురువులను సన్మానించారు. తెలుగు రాష్ట్రాల భక్తులతో పాటు కర్ణాటక, మహారాష్ట్రకు చెందిన భక్తులు కూడా



హాజరై గురుపాద పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా దత్తగిరి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అల్లాడి వీరేశం, బర్దిపూర్ ఉత్సవ కమిటీ సభ్యులు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేశారు.

## పీసీఐ - క్యూసీఐ జాతీయ ర్యాంకింగ్ లలో గీతం ఫార్మసీకి ప్రతిష్టాత్మక 'ఎ' గ్రేడు

**పటాన్చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 29 :** ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీసీఐ), క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (క్యూసీఐ) సహకారంతో నాబెట్ (నాబేట్) ద్వారా 2025-26 విద్యా సంవత్సరానికి గాను జాతీయ ర్యాంకింగ్, ఫార్మసీ కళాశాలల రేటింగ్ (తొలి ఎడిషన్)లో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని హైదరాబాదు, విశాఖపట్నంలోని రెండు ఫార్మసీ స్కూళ్లు అత్యున్నత రేటింగ్ అయిన ప్రతిష్టాత్మక 'ఎ' గ్రేడును సాధించడం ద్వారా ఒక ముఖ్యమైన మైలురాయిని చేరుకున్నాయని గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ, హైదరాబాద్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.ఎస్. కుమార్ బుధవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. ఈ జాతీయ మూల్యాంకనంలో భారతదేశ వ్యాప్తంగా బి.ఫార్మసీ కోర్సులను అందిస్తున్న 398 సంస్థలను అంచనా వేసినట్టు తెలియజేశారు. వీటిలో, కేవలం 64 సంస్థలు (16.1 శాతం) మాత్రమే ప్రతిష్టాత్మకమైన 'ఎ' గ్రేడును సాధించాయని, ఇది ఈ మూల్యాంకనం యొక్క తీవ్రమైన పోటీతత్వాన్ని స్పష్టం చేస్తోందన్నారు. ఈ ప్రతిష్టాత్మక జాతీయ ర్యాంకింగ్ లో గీతం విశాఖపట్నం 43వ ర్యాంకును సాధించి, దేశంలోని అగ్రశ్రేణి 10.8 శాతం ఫార్మసీ సంస్థలలో ఒకటిగా నిలిచిందని తెలిపారు. అదే సమయంలో, గీతం హైదరాబాదు 54వ ర్యాంకును సాధించి, జాతీయ స్థాయిలో అగ్రశ్రేణి 13.6 శాతం సంస్థలలో ఒకటిగా నిలిచిందన్నారు. ఈ విజయం ఫార్మాస్యూటికల్ విద్య, పరిశోధన, మౌలిక సదుపాయాలు, పరిపాలన, విద్యార్థుల ఫలితాలలో శ్రేష్ఠత పట్ల గీతం యొక్క నిబద్ధతను పునరుద్ఘాటిస్తోందని పేర్కొన్నారు. ఈ గుర్తింపు, నాణ్యత, ఆవిష్కరణ, విద్యా నైపుణ్యంపై విశ్వవిద్యాలయం యొక్క అచంచలమైన దృష్టిని ప్రతిబింబిస్తుందన్నారు. అంతే కాకుండా, ఇది విశ్వవిద్యాలయం యొక్క దూరదృష్టి గల నాయకత్వానికి, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు, పరిశోధక విద్యార్థుల అంకితభావానికి, రెండు ఫార్మసీ స్కూల్స్ చేపట్టిన నిరంతర సంస్థాగత నాణ్యతా కార్యక్రమాలకు నిదర్శనంగా నిలుస్తుందని వివరించారు. ఈ అద్భుతమైన జాతీయ విజయం సాధించినందుకు, గీతం నాయకత్వం రెండు

GITAM
DEEMED TO BE UNIVERSITY

ప్రాంగణాలలోని ఫార్మసీ స్కూళ్ల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు, పరిశోధక విద్యార్థులు, సహాయక సిబ్బందిని అభినందించినట్టు తెలియజేశారు. అలాగే, శ్రేష్ఠత పట్ల వారి నిరంతర నిబద్ధతను ప్రశంసించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# హైడ్రా రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలి

**13వ వార్డు కౌన్సిలర్ యల్లావుల సువర్ణ హరికృష్ణ యాదవ్**

**హైదరాబాద్ పల్స్, జూలై 29, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:**
రాష్ట్రంలో ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు, నాలాల పరిరక్షణకు తీసుకొచ్చిన హైడ్రా వ్యవస్థను హైదరాబాద్‌కే పరిమితం చేయకుండా రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని 13వ వార్డు కౌన్సిలర్ యల్లావుల సువర్ణ హరికృష్ణ యాదవ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో అనేక ప్రాంతాల్లో చెరువులు, కుంటలు, నాలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడం వల్ల వర్షాకాలంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. అలాంటి అక్రమాలను అరికట్టడం, ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం హైడ్రా వ్యవస్థను తీసుకువచ్చిందని పేర్కొన్నారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అమలు చేస్తున్న ఈ చర్యలను నిజాయితీగా ఆలోచించే ప్రతి ఒక్కరూ స్వాగతించాలని పిలుపునిచ్చారు. కొంతమంది రాజకీయ నాయకులు హైడ్రాపై చేస్తున్న విమర్శలు ప్రజా ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ అనేది రాజకీయాలకు అతీతమైన అంశమని, అక్రమ నిర్మాణాలను తొలగించే చర్యలకు అడ్డంకులు కల్పించడం సమంజసం కాదన్నారు. నిజాయితీగా పనిచేసే అధికారులకు ప్రభుత్వం అండగా నిలవాల్సిన అవసరం ఉందని సూచించారు. డోర్నకల్ పట్టణంలోని పెద్ద



నీటి వనరులను పరిరక్షించకపోతే భవిష్యత్ తరాలకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం, రెవెన్యూ అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. డోర్నకల్ పరిధిలోని చెరువులు, కుంటలపై సమగ్ర సర్వే నిర్వహించి ఆక్రమణలను గుర్తించాలని, చట్టవిరుద్ధ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, రాష్ట్రంలోని అన్ని నీటి వనరులను దశలవారీగా పునరుద్ధరించే ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని కోరారు.

చెరువు, బంధం చెరువు, కొర్లకుంట, బ్రాహ్మణ కుంట వంటి నీటి వనరులపై కూడా ఆక్రమణల ఆరోపణలు ఉన్నాయని, వెంటనే సమగ్ర సర్వే నిర్వహించి వాస్తవ పరిస్థితులను వెలికితీయాలని ఆయన డిమాండ్ చేశారు. చెరువులు బతికితేనే గ్రామాలు, పట్టణాలు బతుకుతాయి. నీటి వనరుల పరిరక్షణలో అధికారులు ఎలాంటి రాజీ పడకుండా చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి" అని యల్లావుల సువర్ణ హరికృష్ణ యాదవ్ విజ్ఞప్తి చేశారు.




## వర్గల్ క్షేత్రంలో.. వైభవంగా గురు పౌర్ణమి వేడుకలు

**గురువులను సత్కరించిన ఆలయ కమిటీ సభ్యులు**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 29, సిద్దిపేట జిల్లా:**
ప్రసిద్ధ వర్గల్ శ్రీ విద్యాదరి క్షేత్రంలో బుధవారం గురు పౌర్ణమి, వ్యాస పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయ పండితులు శ్రీ వ్యాస మహర్షితోపాటు ఆధ్యాత్మిక సంపన్నులు, సనాతన ధర్మ మార్గ దర్శకులకు ప్రత్యేక పూజలు నిర్వహించి వేద గురువులు అభిరామాచార్యులు, శ్రీనివాసచార్యులు, ఆలయ ప్రధాన అర్చకులు ప్రవీణ్ శర్మ తదితరులను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యాస పౌర్ణమి హిందూ సంస్కృతి, సనాతన ధర్మంలో అత్యంత పవిత్రమైన రోజు కాగా, అజ్ఞానమనే చీకటిని తొలగించి, జ్ఞానమనే వెలుగును ప్రసాదించే గురువులను స్మరించుకుని రుణం తీర్చుకోవాలని స్పష్టం చేశారు. ఈ పవిత్రమైన రోజు గురు పౌర్ణమి విశిష్టత, ప్రాముఖ్యత గుర్తు చేస్తుండగా, జగద్గురువు శ్రీ వ్యాస మహర్షిని తొలి గురువుగా పూజించడం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు. తల్లిదండ్రులు జన్మనిస్తే, ఆ జన్మకు సార్థకతను, సరైన మార్గాన్ని చూపించేది గురువులు కాగా, జీవితంలో విద్య, జ్ఞానం, క్రమశిక్షణ, మంచి మార్గం నేర్పిన గురువును దర్శించుకుని ఆశీస్సులు పొందాలని ఆకాంక్షించారు.

## మున్సిపల్ పారిశుధ్ధ్య కార్మికులకు రెయిన్‌కోట్లు పంపిణీ చేసిన మున్సిపల్ చైర్మన్ నగేష్ షెట్కర్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 29, నారాయణ ఖేడ్ :**
నారాయణఖేడ్ మున్సిపాలిటీ లో వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ మున్సిపల్ చైర్మన్ నగేష్ షెట్కర్ మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు రెయిన్‌కోట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ నగేష్ షెట్కర్ మాట్లాడుతూ, ఎలాంటి వాతావరణ పరిస్థితుల్లోనైనా ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య సేవలు అందిస్తూ మున్సిపాలిటీని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికులు కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. వర్షాకాలంలో విధులు నిర్వహించే సమయంలో వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఈ రెయిన్‌కోట్లను అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రశాంతి, మున్సిపల్ కౌన్సిలర్లు వివేకానంద మహేందర్, లక్ష్మణ్, బాణాపురం రాజూ,మహేష్, షారుక్, గోపాల్ రెడ్డి, మైటబ్, సుబూర్, కో-ఆప్షన్ సభ్యులు ముంతాజ్, నగేష్, మున్సిపల్ అధికారులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కోటియా నాయక్ మృతి తీరని లోటు.. కౌసల్యాదేవిపల్లి సర్పంచ్ ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి



**హైదరాబాద్ పల్స్, జూలై 29, నర్సింహులపేట :**
కౌసల్యాదేవిపల్లి, రూప్ల తండా గ్రామానికి చెందిన బానోతు కోటియ నాయక్ తీవ్ర జ్వరంతో బాధపడుతూ మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి కోటియా నాయక్ పార్థివ దేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కోటియ నాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. కుటుంబానికి భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ ఉప్పుటూరి కేతమ్మ,సుబ్బారావు స్థానిక నాయకులు, తండావాసులు పాల్గొని కోటియా నాయక్ కు నివాళులర్పించారు.

# గురు పౌర్ణిమ సందర్భంగా ప్రత్యేక పూజలు

**పాల్గొన్న పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి, భారతి నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి.**

**రామచంద్రపురం, హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 29 :**
గురు పౌర్ణిమ సందర్భంగా పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి, భారతి నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి అమీన్‌పూర్ డివిజన్ పరిధిలోని సాయి కాలనీలోని శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయంలో నిర్వహించిన గురు పౌర్ణిమ వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాయిబాబా వారికి పాలాభిషేకం, పుష్పార్చన, హారతి కార్యక్రమాల్లో పాల్గొని ఆశీర్వాదాలు పొందారు. అలాగే భక్తులకు ప్రసాద పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం భారతి నగర్ డివిజన్ పరిధిలోని మాక్ సొసైటీ మరియు ఓల్డ్ ఎమ్ఐ జి కాలనీ లో నిర్వహించిన గురు పౌర్ణిమ వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గురువుల ఆశీస్సులతో ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖశాంతులు చేకూరాలని, రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు. గురువుల బోధనలు సమాజానికి మార్గదర్శకాలని, ప్రతి ఒక్కరూ వాటిని ఆచరణలో పెట్టాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అమీన్‌పూర్ మాజీ కౌన్సిలర్ బాల్‌రాజ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జగన్నాథ్ రెడ్డి, మాక్ సొసైటీ కమిటీ సభ్యులు మల్లేష్ యాదవ్, రవీందర్ రెడ్డి, ఓల్డ్ ఎం ఐ జి కాలనీ కమిటీ సభ్యులు అనిత, ప్రసాద్, రాజు, బీఆర్ఎస్ నాయకులు మాజీ కౌన్సిలర్ నాగమణి, సత్యనారాయణ, వెంకట్ రెడ్డి, రాకేష్, మునీందర్, లక్ష్మి మరియు ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# హైడ్రా చర్యలపై ముఖ్యమంత్రికి అడ్వొకేట్ రవికృష్ణ బహిరంగ ప్రశ్నలు

**తుది తీర్పు రాకముందే ప్రభుత్వ భూమిగా ఎలా ప్రకటిస్తారని ప్రశ్న**

**ఆక్రమణల తొలగింపులో సమాన న్యాయం పాటించాలని సూచన**

**పటాన్ చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 29 :**
రాష్ట్రంలో హైడ్రా చేపడుతున్న భూ పరిరక్షణ, ఆక్రమణల తొలగింపు చర్యలపై అడ్వొకేట్ రవికృష్ణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి సామాజిక మాధ్యమ వేదికలో బహిరంగంగా పలు ప్రశ్నలు సంధించారు. న్యాయస్థాన ఆదేశాల అమలు, ప్రభుత్వ భూముల గుర్తింపు, ఆక్రమణల తొలగింపులో ఒకే విధమైన ప్రమాణాలు పాటించాలని ఆయన కోరారు. న్యాయస్థానం ఇచ్చిన తీర్పుపై అభ్యంతరాలు ఉంటే చట్టం నిర్దేశించిన విధంగా పైస్థాయి న్యాయస్థానాన్ని ఆశ్రయించాల్సిందేనని రవికృష్ణ పేర్కొన్నారు. అయితే న్యాయస్థాన ఆదేశాలు అమల్లో ఉన్నప్పటికీ వాటిని పాటించకుండా వ్యవహరిస్తే అది న్యాయస్థాన ధిక్కారానికి దారితీసే అవకాశముందని అభిప్రాయపడ్డారు. ఇది ప్రభుత్వ న్యాయ సలహా బృందం వైఫల్యమా, లేక న్యాయస్థానాల ఆదేశాల పట్ల నిర్లక్ష్యమా అని ప్రశ్నించారు. ఐలాపూర్ భూముల విషయం లో ఇప్పటివరకు ఆ భూములు ప్రభుత్వానివేనని ఏ న్యాయస్థానం తుది తీర్పు ఇవ్వలేదని ఆయన పేర్కొన్నారు.



ప్రస్తుతం ఉన్న తీర్పు ప్రకారం ఆ భూములు వ్యక్తిగత యాజమాన్యంలోని భూములుగా గుర్తించబడ్డాయని, ఆ తీర్పుపై దాఖలైన అప్పీలు ఇంకా పెండింగ్‌లో ఉండగా, యథాతథ స్థితిని కొనసాగించాలని న్యాయస్థానం ఆదేశాలు అమల్లో ఉన్నాయని తెలిపారు. అలాంటి పరిస్థితుల్లో అక్కడ కంచె ఏర్పాటు చేయడం ఏ అధికారంతో జరిగిందని ప్రశ్నించారు. అలాగే ఐలాపూర్‌లో ఎనిమిది వందల అరవై ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా పరిరక్షించిందని ప్రభుత్వ ప్రచార విభాగం ప్రకటించడాన్ని కూడా ఆయన ప్రశ్నించారు. న్యాయస్థానం తుది తీర్పు వెలువడకముందే ఆ భూమిని ప్రభుత్వ భూమిగా ప్రకటించడం ఏ చట్టం ప్రకారం జరిగిందని నిలదీశారు. పటాన్‌చెరువు–అమీన్పూర్ ప్రాంతంలోని ఆక్రమణల అంశాన్ని కూడా రవికృష్ణ ప్రస్తావించారు. అమీన్‌పూర్ సర్వే నంబరు తొమ్మిది వందల తొంభై మూడులో సుమారు వంద ఎకరాలు, సర్వే నంబరు నాలుగు వందల అరవై రెండులో రెండు ఎకరాలు, సర్వే నంబరు వెయ్యిలో సుమారు ఒకటిన్నర ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందని పేర్కొన్నారు. కృష్ణారెడ్డిపేట సర్వే నంబరు నూట అరవై నాలుగులో ప్రభావశీలులకు చెందిన అనేక భారీ నిర్మాణాలు ఉన్నప్పటికీ ఒక నిర్మాణంపైనే చర్యలు తీసుకున్నట్లు ప్రచారం చేశారని, మిగిలిన వాటిపై చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారం. బీరంగూడ శంభునికుంటలో మొత్తం ఇరవై రెండు ఎకరాల పన్నెండు గుంటల భూమిలో సుమారు పద్నాలుగు ఎకరాలు ఆక్రమణకు గురయ్యాయని తెలిపారు. అదే ప్రాంతంలో చెరువు శికం భూమిని ఆక్రమించి చట్టబద్ధ అనుమతులు లేకుండా ఐదు అంతస్తుల వాణిజ్య భవనం నిర్మించి అద్దెకు ఇచ్చి ఆదాయం పొందుతున్నారనే ఆరోపణలు ఉన్నాయని, దీనిపై హైడ్రా చేపట్టిన చర్యలు ఏమిటో వెల్లడించాలని కోరారు. ఈ విషయాలపై హైడ్రా కమిషనర్‌ను ప్రశ్నించగా, ఇతర శాఖల పనితీరు గురించి ఆయా శాఖలను అడగాలని, హైడ్రా తన విధులు నిర్వహిస్తోందని, అమీన్‌పూర్‌లో కూడా అనేక ప్రభుత్వ భూములను పరిరక్షించామని సమాధానం ఇచ్చినట్లు రవికృష్ణ తెలిపారు. చట్టం ముందు అందరూ సమానమేనని, చిన్నవారికి ఒక విధానం, పెద్దవారికి మరో విధానం ఉండకూడదని రవికృష్ణ అన్నారు. న్యాయస్థానం తుది తీర్పు వెలువడకముందే భూములను ప్రభుత్వ భూములుగా ప్రకటించడం సరికాదని పేర్కొంటూ, ఈ అంశాలపై ప్రభుత్వం, హైడ్రా అధికారులు ప్రజలకు స్పష్టమైన వివరణ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

# బీరంగూడ గుట్టపై ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

**ప్రధాన అర్చకులను సన్మానించిన ఆలయ చైర్మన్ సుధాకర్ యాదవ్, అధికారులు మరియు కమిటీ సభ్యులు!**

**అమీన్పూర్, హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 29 :**
ఈ పవిత్ర గురుపౌర్ణమి శుభదినం సందర్భంగా, బీరంగూడ గుట్టపై వెలసిన శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి దివ్య సన్నిధిలో ప్రత్యేక పూజలు మరియు గురు పూజలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించబడుతున్నాయి. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ శ్రీ సుధాకర్ యాదవ్ గురుపౌర్ణమి విశిష్టతను వివరిస్తూ... "భారతీయ సంస్కృతిలో తల్లిదండ్రుల తర్వాత స్థానం గురువులదేనని, గురువును దైవంతో సమానంగా భావించి పూజించడం మన హైందవ సంప్రదాయం" అని పేర్కొన్నారు. గురువులు చూపిన సన్మార్గంలో నడుస్తూ, సమాజానికి మంచి మార్గదర్శకత్వం అందించాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. దేవాలయ ఆధ్వర్యంలో గురుపౌర్ణమి వేడుకలను పురస్కరించుకుని ఆలయ చైర్మన్ సుధాకర్ యాదవ్, ఆలయ అధికారులు మరియు కమిటీ సభ్యులు అందరూ కలిసి ప్రధాన అర్చకులను ఘనంగా సన్మానించి వారి ఆశీర్వాదాలు తీసుకోవడం జరిగింది. లిసన్మాన కార్యక్రమం:లి ఆలయ చైర్మన్ శ్రీ సుధాకర్ యాదవ్, ఆలయ అధికారులు మరియు కమిటీ సభ్యులు వేడుకల్లో భాగంగా ప్రధాన అర్చకులను ఘనంగా సన్మానించి, వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు.

**ప్రధాన అర్చకులు: శ్రీ రాధాకృష్ణ.**

**ప్రత్యేక పూజ: ప్రహ్లోద్ ఆధ్వర్యంలో గురు పూజ మరియు స్వామి వారి ఆశీర్వాదాలు తీసుకోవడం జరిగింది.**



# రైతు సేవలకు ప్రతిష్ఠాత్మక గుర్తింపు.. జిల్లా ఉత్తమ ఏఈఓగా అవినాష్‌కు పురస్కారం

**హైదరాబాద్ పల్స్, జూలై 29, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:**
రైతు సంక్షేమం, శాస్త్రీయ వ్యవసాయ విస్తరణకు అంకితభావంతో పనిచేసిన డోర్నకల్ డివిజన్ వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) అవినాష్‌కు జిల్లాస్థాయి ఉత్తమ ఏఈఓ పురస్కారం లభించింది. మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును అందుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ అధికారులు పాల్గొని అభినందనలు తెలిపారు. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం చిలుకోడు రైతు వేదికలో ప్రతి వారం నిర్వహించిన 'రైతు నేస్తం' కార్యక్రమం వంద ఎపిసోడ్ల విజయాన్ని పూర్తి చేయడం విశేషంగా నిలిచింది. రైతులకు ఆధునిక సాగు పద్ధతులు, పంటల సంరక్షణ, వాతావరణ మార్పులకు అనుగుణంగా తీసుకోవాల్సిన చర్యలు, తెగుళ్ల నివారణ, ఎరువుల సమతుల్య వినియోగం, నీటి నిర్వహణ, ప్రభుత్వ పథకాలపై నిరంతరం అవగాహన కల్పిస్తూ వ్యవసాయాభివృద్ధికి ఆయన విశేషంగా కృషి చేశారు. రైతులతో ప్రత్యక్షంగా మమేకమై వారి సమస్యలను తెలుసుకుని, శాస్త్రీయ పరిష్కారాలను అందించడం ద్వారా రైతుల్లో విశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు వ్యవసాయంలో నూతన సాంకేతికత వినియోగాన్ని ప్రోత్సహించారని అధికారులు పేర్కొన్నారు. రైతు నేస్తం కార్యక్రమం గ్రామీణ ప్రాంత రైతులకు ఉపయోగకరమైన వేదికగా నిలిచిందని తెలిపారు. ఈ పురస్కారం తన సేవలకు లభించిన గౌరవమని, రైతుల ఆదాయాన్ని పెంచే ఆధునిక వ్యవసాయ పద్ధతులను మరింత విస్తృతంగా గ్రామీణ స్థాయికి తీసుకెళ్లేందుకు భవిష్యత్తులోనూ



మరింత అంకితభావంతో పనిచేస్తానని ఏఈఓ అవినాష్ తెలిపారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా వ్యవసాయ శాఖ చేపడుతున్న కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడంలో తన వంతు కృషి కొనసాగుతుందని పేర్కొన్నారు.


# రఘునాథపురం శ్రీ వెంకటేశ్వర ఆలయంలో ఘనంగా గురుపూజ మహోత్సవం




**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 29, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా, రాజపేట మండలం రఘునాథపురం గ్రామంలోని అతి పురాతనమైన కోరికలు తీర్చే శ్రీదేవి భూదేవి సమేత శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం రోజు గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయంలో, ముందుగా శ్రీ శ్రీ శ్రీ భగవద్ రామానుజుల మూర్తికి పంచామృతాలతో ప్రత్యేక అభిషేకాలు శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి వారి గురుపూజ మహోత్సవం రఘునాథపురం వికాస తరంగిణి సభ్యులు శ్రీ స్వామివారి శిష్య బృందం, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులచే, ఆలయ అర్చకులు శ్రీమాన్ చక్రవర్తుల శ్రీనివాసచార్యులు గురుపూజ మహోత్సవం అత్యంత వైభవోపేతంగా ఘనంగా నిర్వహించారు. అనంతరం శ్రీ స్వామి వారికి నైవేద్య నివేదనలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం శ్రీ స్వామివారి శిష్య బృందం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శ్రీ వెంకటేశ్వర భజన మండలి భక్త బృందం సభ్యులు, శివరామకృష్ణ భజన మండలి భక్త బృందం సభ్యులు, వికాస తరంగిణి అధ్యక్షులు భోగా లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి, బల్ల నరహరి, వికాస తరంగిణి సభ్యులు, మాదూరి బాలయ్య, బల్ల నాగభూషణం, సామల భాస్కర్, కటకం సంతోష్, భోగ వెంకటేశం, కల్లూరి అరుణమ్మ, మాదూరి సునంద, కుందారపు ఉమా, పొట్టబత్తిని వెంకటేశం, కటకం శ్రీనివాస్, చెన్న బాలా సిద్ధులు తదితరులు పాల్గొన్నారు

# 'హస్తినలో తెలుగు వెలుగు' వేడుకల్లో డా. వకుళాభరణం కృష్ణ మోహన్ రావుకు జాతీయ విశిష్ట సేవా పురస్కారం

**శేరిలింగంపల్లి, జూలై 29, హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :**
న్యూఢిల్లీ, జూలై 29: తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్, బీజేపీ సీనియర్ నాయకుడు డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావుకు జాతీయ తెలుగు సారస్వత పరిషత్ ప్రతిష్ఠాత్మక 'జాతీయ విశిష్ట సేవా పురస్కారం' ప్రదానం చేసింది. న్యూఢిల్లీలోని ఆంధ్రా అసోసియేషన్ భవన్లో మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించిన 'హస్తినలో తెలుగు వెలుగు' వేడుకల్లో కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ ఈ పురస్కారాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు. ప్రజా జీవితం, వెనుకబడిన వర్గాల సంక్షేమం, తెలుగు భాషా–సాహిత్యాభివృద్ధి, సామాజిక రంగాల్లో డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావు అందించిన విశిష్ట సేవలను గుర్తించి ఈ పురస్కారాన్ని ప్రదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్ రావు, జాతీయ తెలుగు సారస్వత పరిషత్ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ రామప్రసాద్, పరిషత్ ప్రతినిధులు ముత్యాల శ్రీనివాస్, డాక్టర్ సుధీర్ రమణ, కాంతేటి వెంకటరాజు, ఆదిలీలా ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ఎస్. ఆదినారాయణతో పాటు రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన సాహితీవేత్తలు, కళాకారులు, సామాజికవేత్తలు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతి వైభవాన్ని చాటిచెప్పేలా అత్యంత వైభవంగా ఈ వేడుకలు నిర్వహించారు.




# సాయిబాబాను దర్శించి ప్రత్యేక పూజలు చేసిన బీమాగొని సంతోష్ దంపతులు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 29, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : యాదా**ద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ, సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి సందర్భంగా భీమగోని సంతోష్ ఫౌండేషన్ చైర్మన్ బీమాగోని సంతోష్ – హేమలత కుటుంబ సమేతంగా స్వామివారిని సందర్శించి తమ మొక్కులను చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా సంతోష్ గౌడ్ మాట్లాడుతూ... గ్రామంలోని పాడి పంటలు సుభిక్షంగా ఉండాలని గ్రామ ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవితం కొనసాగించాలని ఆయన భగవంతుని కోరుకున్నట్లు మీడియాకు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంకం రాజయ్య, అంకం శ్రీనివాస్, ఆరుట్ల కొండల్ రెడ్డి, సాయిబాబా కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## రాజపేట మండలానికి ఆదర్శవంతంగా కాల్వపల్లి గ్రామం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 29, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలం కాల్వపల్లి సర్పంచ్ ఇంజ లక్ష్మీ ఆధ్వర్యంలో రాజపేట మండలంలో అభివృద్ధిలో కాల్వపల్లి గ్రామం ముందుంది. శుక్రవారం రోజు గ్రామ పంచాయతీ ఆవరణలో మొక్కలు పంపిణీ కార్యక్రమం కాల్వపల్లి పాలక వర్గం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమనకి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి ఇంజ నరేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి ఇంజ నరేష్ మాట్లాడుతూ... ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ప్రత్యేక చొరవతో కాల్వపల్లి గ్రామం అభివృద్ధిలో దూసుకుపోతోందని అన్నారు, ఇందిరమ్మ ఇల్లు, సిసి రోడ్స్, అండర్ డ్రైనేజ్, ఎస్సీ కమిటీ హాల్, మహిళా సంఘం బిల్డింగ్, ప్రాథమిక వ్యవసాయ ప్రైమరీ కేంద్రం కాల్వపల్లి, ఇంకుడు గుంతల నిర్మాణం, శుక్రవారం రోజు కూరగాయల మార్కెట్, డస్ట్ బిన్స్, లాంటి ఎన్నో పథకాలు కాల్వపల్లి గ్రామంలో నిర్వహించడం జరిగుతుందని తెలిపారు. గ్రామ ప్రజల సహకారంతో పాలకవర్గ మద్దతుతో కాల్వపల్లి గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసే విధంగా సర్పంచ్ ఇంజ లక్ష్మి తో పాటు వారి కుమారుడు కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి ఇంజ నరేష్ కృషి చేస్తున్నారు

## రేషన్ డీలర్ల సభ్యత్వ నమోదు కార్యక్రమం ఘన ప్రారంభం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 29, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :**
తెలంగాణ రాష్ట్ర ఆథరైజ్డ్ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రమేష్ బాబు, రాష్ట్ర కార్యవర్గం పిలుపు మేరకు చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు ఊకె శేఖర్ బుధవారం భద్రాచలం మండలంలో ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా సభ్యత్వ నమోదును విస్తృతంగా చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. రేషన్ డీలర్ల సంక్షేమం, సంఘం బలోపేతమే లక్ష్యంగా ప్రతి రేషన్ డీలర్ సభ్యత్వం పొందాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా, డివిజన్, మండలాల ఆథరైజ్డ్ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం నాయకులు, రేషన్ డీలర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం డివిజన్ అధ్యక్షుడు భూక్యా సందీప్‌తో పాటు భూక్యా లక్ష్మణ్, జీ. రమేష్, ఎస్. రాంబాబు, వి. వీరయ్య, భూక్యా సాయి కౌశిక్, కె. రమాదేవి, పి. సరోజిని తదితరులు పాల్గొన్నారు.

## స్త్రీనిధి పరపతి సహకార సమైక్య ఉమ్మడి మెదక్ జిల్లా డైరెక్టర్గా హీనా బేగం ఘనవిజయం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జులై 29, నారాయణ ఖేడ్ :**
ఉమ్మడి మెదక్ జిల్లా స్త్రీనిధి పరపతి సహకార సమైక్య డైరెక్టర్ ఎన్నికల్లో నాగల్గిద్ద మండలం ఎస్గి గ్రామానికి చెందిన హీనా బేగం ఆరు ఓట్ల మెజారిటీతో ఘనవిజయం సాధించారు. ప్రస్తుతం ఆమె నాగల్గిద్ద మండల మహిళా సమైక్య అధ్యక్షురాలుగా కొనసాగుతున్నారు. స్త్రీనిధి పరపతి సహకార సమైక్య ఉమ్మడి మెదక్ జిల్లా డైరెక్టర్ పదవికి జరిగిన హోరాహోరీ ఎన్నికల్లో హీనా బేగం పోటీ చేయగా, ఉమ్మడి జిల్లాలోని సభ్యులందరూ కలిసికట్టుగా ఓట్లు వేసి ఆమెను గెలిపించారు. ఉమ్మడి జిల్లాలోనే మారుమూల ప్రాంతమైన నాగల్గిద్ద మండలం ఎస్గి గ్రామానికి చెందిన మహిళకు ఈ ఉన్నత పదవి దక్కడం విశేషం. సభ్యుల నమ్మకాన్ని వమ్ము చేయను: హీనా బేగం, అబ్దుల్ రహీంతన గెలుపుకు సహకరించిన ఉమ్మడి మెదక్ జిల్లాలోని మండల మహిళా సమైక్య అధ్యక్షులకు, స్త్రీనిధి సహకార పరపతి సభ్యులకు, ప్రతి ఒక్కరికీ హీనా బేగం, అబ్దుల్ రహీంలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తమపై నమ్మకంతో గెలిపించిన సభ్యులందరికీ మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలుపుతూ, ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా నీతి, నిజాయితీలతో సేవ చేస్తామని వారు స్పష్టం చేశారు. ముఖ్యంగా సంగారెడ్డి జిల్లాతో పాటు నారాయణఖేడ్ నియోజకవర్గంలోని మండల మహిళా సమైక్య అధ్యక్షులకు, స్త్రీనిధి సభ్యులకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

### ఐటీసీ మిషన్ సునేహ్రా కల్ ఆధ్వర్యంలో
## ఒడియా క్యాంపులో నూతన అంగన్‌వాడీ భవనం ప్రారంభం

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 29, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం సారపాక గ్రామపంచాయతీ పరిధిలోని ఒడియా క్యాంపులో ఐటీసీ మిషన్ సునేహ్రా కల్ సహకారంతో, వాష్ ఇన్‌స్టిట్యూట్ సుమారు రూ.11.50 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన అంగన్‌వాడీ భవనాన్ని నేడు ఘనంగా ప్రారంభించారు. ఈ భవనాన్ని సారపాక గ్రామపంచాయతీ సర్పంచ్ శివరాం కిశోర్ నాయక్ మరియు 8వ వార్డు సభ్యురాలు ఉమ సంయుక్తంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి స్వర్ణలత లెనిన్ మాట్లాడుతూ, చిన్నారులకు నాణ్యమైన ప్రాథమిక విద్య, పోషకాహారం సురక్షితమైన, పిల్లలకు అనుకూలమైన వాతావరణాన్ని అందించడంలో ఆధునిక అంగన్‌వాడీ కేంద్రాల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు, చిన్నారుల సంక్షేమానికి అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడంలో ఐటీసీ మిషన్ సునేహ్రా కల్ వాష్ ఇన్‌స్టిట్యూట్ చేస్తున్న కృషిని ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో శిశు అభివృద్ధి ప్రాజెక్టు అధికారి మంగతాయారు. ఐటీసీ చీఫ్ మేనేజర్ చెంగలరావు, ఐటీసీ మిషన్ సునేహ్రా కల్ ప్రోగ్రామ్ మేనేజర్ జయప్రకాశ్, ఐటీసీ ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్ గీత, ఐటీసీ మిషన్ సునేహ్రా కల్ ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్ తార ప్రసాద్, వాష్ ఇన్‌స్టిట్యూట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ జి.ఆర్. బాలకృష్ణ, ఉప సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, వాష్ ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధులు గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, ఐటీసీ మిషన్ సునేహ్రా



కల్ సహకారంతో వాష్ ఇన్‌స్టిట్యూట్ గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు, చిన్నారుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన సామాజిక మౌలిక వసతుల అభివృద్ధి మరియు స్థిరమైన గ్రామీణ అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తుందని తెలిపారు. ఈ నూతన అంగన్‌వాడీ భవనం ద్వారా గ్రామంలోని చిన్నారులు, గర్భిణీలు మరియు బాలింతలకు మెరుగైన సేవలు అందుబాటులోకి రానున్నాయని పేర్కొన్నారు.

## చెరువును తలపిస్తున్న నారాయణఖేడ్ బైపాస్ రోడ్డు

**బైపాస్ రోడ్డుపై నిలిచిన వర్షపు నీటిలో నిలబడి నిరసన తెలిపిన నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 29, నారాయణ ఖేడ్ :**
గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో నారాయణఖేడ్ పట్టణంలోని బైపాస్ రోడ్డు పూర్తిగా చెరువును తలపించేలా మారిందని, ప్రజలు నిత్యం ప్రాణాలను పణంగా పెట్టి ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడిందని నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బైపాస్ రోడ్డుపై నిలిచిన వర్షపు నీటిలోనే నిలబడి నిరసన వ్యక్తం చేస్తూ ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి మాట్లాడుతూ... "నేను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నారాయణఖేడ్ అభివృద్ధే లక్ష్యంగా బైపాస్ రోడ్డు సహా అనేక ప్రధాన రోడ్లకు నిధులు మంజూరు చేయించి, పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకున్నాం. కానీ ప్రభుత్వం మారిన తర్వాత స్థానిక ఎమ్మెల్యే సంజీవ్ రెడ్డి పూర్తిగా అభివృద్ధిని పక్కనబెట్టి ప్రజా సమస్యలను గాలికొదిలేశారు. కమిషన్లకే ప్రాధాన్యత ఇస్తూ కాంట్రాక్టర్లపై ఒత్తిడి తెచ్చి పనులు నిలిపివేయడంతో నేడు ప్రజలు ఈ దుస్థితిని అనుభవిస్తున్నారు." అని తీవ్ర విమర్శలు చేశారు. బైపాస్ రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడి వాటిలో వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఈ రహదారి సమీపంలో పాఠశాలలు, ఆసుపత్రులు ఉండటంతో విద్యార్థులు, రోగులు, వృద్ధులు, గర్భిణీలు నిత్యం ప్రాణభయంతో ప్రయాణించాల్సి వస్తోందని అన్నారు. పట్టణంలోని అనేక ప్రాంతాల్లో కూడా రోడ్లు పూర్తిగా దెబ్బతిని గుంతలమయంగా మారాయని, వర్షం పడితే నీరు నిలిచి ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని పేర్కొన్నారు. మున్సిపాలిటీ పూర్తిగా విఫలమైందని, రోజువారీ చెత్తను సకాలంలో తొలగించకపోవడంతో వర్షపు నీటితో కలిసి దుర్వాసన వెదజల్లుతూ దోమలు పెరిగి ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారిందని మండిపడ్డారు. అలాగే పట్టణ ప్రజలకు సకాలంలో తాగునీరు కూడా అందడం లేదని, తాగునీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందించడంతో పాటు పట్టణంలో అవసరమైన నీటి ట్యాంకులను నిర్మించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నామని, కానీ ప్రస్తుతం ఆ వ్యవస్థను పూర్తిగా




నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. "ప్రజలు ఎదుర్కొంటున్న ఈ సమస్యలను ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే వెంటనే పరిష్కరించాలి. దెబ్బతిన్న రోడ్లను అత్యవసరంగా పునర్నిర్మించి, పట్టణంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచి, తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలి. ప్రజల సమస్యలను ఇకపై కూడా నిర్లక్ష్యం చేస్తే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నారాయణఖేడ్ ప్రజల తరఫున పెద్ద ఎత్తున ఆందోళనలు, నిరసనలు చేపడతాం. ప్రజల కోసం ఎంతవరకైనా పోరాడతాం." అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు విఠల్‌రావు పటేల్, మాజీ మున్సిపల్ చైర్మన్ నజీబ్, పట్టణ పార్టీ అధ్యక్షులు నగేష్ సేట్, మాజీ మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు లయక్, రాజు నాయక్, రవీందర్ రెడ్డి, మల్గొండ తదితరులు పాల్గొన్నారు.

## బౌద్ధ నగర్ సాయి సన్నిధానం వారి గురు పౌర్ణమి మహోత్సం

**ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహణ**

**జూలై 29, సుచిత్ర, హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :**
మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని సుచిత్ర బౌద్ధ నగర్ కాలనీలోని సాయిబాబా ఆలయంలో గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వ్యాస పూర్ణిమ అని కూడా పిలువబడే గురు పూర్ణిమ, ప్రతి భక్తుని జీవితంలో మార్గదర్శి అయిన ఆధ్యాత్మిక గురువును గౌరవించడానికి, స్మరించుకోవడానికి కేటాయించబడిన ఒక పవిత్రమైన రోజు గురు పౌర్ణమి రోజున సాయిబాబాను సద్గురువుగా భావించి పూజిస్తారు. సాయిబాబాను దేవుని కంటే ముందు తమను సక్రమమైన మార్గంలో నడిపించే గురువుగా



భక్తులు నమ్ముతారు. షిర్డీలో బాబా జీవించి ఉన్న కాలంలోనే భక్తులు ఆయన అనుమతితో గురు పౌర్ణమి పూజా వేడుకలను ప్రారంభించడం ఒక ప్రధాన కారణం. సాయిబాబా తనను తాను భక్తులకు మార్గదర్శనం చేసే గురువుగా ప్రకటించుకున్నారు. గురువు మనలోని అజ్ఞానాన్ని పోగొట్టి జ్ఞానాన్ని ఇస్తాడని భక్తుల ప్రగాఢ విశ్వాసం. గురు పౌర్ణమి నాడు బాబా ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, భజనలు మరియు పారాయణాలు నిర్వహిస్తారు. సాయిబాబా మందిరాలకు రంగు రంగుల పూలతో బాబా హారతితో, భక్తుల భజనలతో ఆలయ ప్రాంగణం అంత దైవ స్మరణతో చిన్న పెద్ద తేడా లేకుండా సాయిబాబా నామాన్ని స్మరిస్తారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్న ప్రసాద వితరణ ఆలయ కమిటీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ పి.సుబ్బారావు, జనరల్ సెక్రటరీ మధు కృష్ణ, వైస్ ప్రెసిడెంట్ సుషీల్ కుమార్, ఆర్గనైజషన్ సెక్రటరీ ఎం. నర్సిములు, వి.వెంకటేష్ నాగేశ్వర్రావు తదితరులు, ఆలయ సిబ్బంది, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సర్పంచ్ డీఎస్ కళావతి జగదీష్ చొరవ ఫలించింది.. చిన్నారి శస్త్రచికిత్సకు రూ.4 లక్షల ఆర్థిక భరోసా

**హైదరాబాద్ పల్స్, జూలై 29, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:**
డోర్నకల్ మండలం ముల్కలపల్లి గ్రామానికి చెందిన దోమల అరుణ్ కుమార్, సంధ్యారాణి దంపతుల కుమారుడికి అత్యవసర శస్త్రచికిత్స కోసం అవసరమైన ఆర్థిక సహాయం అందించడంలో ములకలపల్లి గ్రామ సర్పంచ్ డిఎస్ కళావతి జగదీష్, కీలక పాత్ర పోషించారు. బాధిత కుటుంబ పరిస్థితిని గుర్తించిన ఆమె, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యుడు పోరిక బలరాం నాయక్‌ను కలిసి చిన్నారి ఆరోగ్య పరిస్థితిని వివరించి, వైద్య సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. సర్పంచ్ విజ్ఞప్తికి వెంటనే స్పందించిన ఎంపీ పోరిక బలరాం నాయక్, ఎల్ఓసీ ద్వారా రూ.4 లక్షల వైద్య సహాయాన్ని మంజూరు చేయించారు. ఈ సహాయంతో చిన్నారికి అవసరమైన శస్త్రచికిత్స నిర్వహించేందుకు ఆర్థిక ఇబ్బందులు తొలగడంతో కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కళావతి జగదీష్ మాట్లాడుతూ.. అవసరమైన సమయంలో సహాయం అందించడం ప్రజాసేవకు నిదర్శనమని గ్రామస్థులు కొనియాడారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు సర్పంచ్ డి.ఎస్. కళావతి జగదీష్‌తో పాటు ఎంపీ పోరిక బలరాం నాయక్‌కు కృతజ్ఞతలు



తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు ఇట్టి మల బిక్షపతి, గ్రామ పంచాయతీ కో-ఆప్షన్ సభ్యులు జిక్కుల రాంబాబు, భూక్యా నుధర్ సింగ్, గ్రామ పెద్ద బొజ్జ పాండురంగయ్య, ఉపేందర్, శిరసవాడ శ్రీను, అనిల్‌తో పాటు పలువురు ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆల్వాల్ టిమ్స్ ఆసుపత్రి నిర్మాణ పనులలో జాప్యం-మన్నే క్రిశాంక్

### కెసిఆర్ ఆనవాళ్లను లేకుండా చేయాలనే కుట్రతో కాంగ్రెస్ ప్రభుత్వం

**జూలై 29, ఆల్వాల్, హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :** సికింద్రాబాద్ కంటోన్మెంట్ బి.అర్.ఎస్ నాయకులు అల్వాల్ టీమ్స్ ఆసుపత్రిని సందర్శించారు. నిర్మాణ పనుల గురించి ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడిన బిఆర్ఎస్ నేతలు వేగంగా ఆసుపత్రి నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా బి.ఆర్.ఎస్ నాయకుడు మన్నె క్రిశాంక్ మాట్లాడుతూ ఉత్తర తెలంగాణతో పాటు నగర శివారు ప్రాంతాలకు చెందిన పేద ప్రజల వైద్య సేవల నిమిత్తం అల్వాల్ టీమ్స్ ఆసుపత్రిని బి.అర్.ఎస్ హయాంలో శంకుస్థాపన చేశారని అన్నారు. బిఆర్ఎస్ హయాంలో ఆసుపత్రి నిర్మాణాన్ని ప్రారంభించి పేద ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో కేసిఆర్ తపించారని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తూ ఆసుపత్రి నిర్మాణ పనులలో జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన కొత్తలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి 90% పనులు పూర్తయ్యాయని త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తామని చెబుతూ ఇప్పటికీ ఆసుపత్రి ప్రారంభించకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. కెసిఆర్ ఆనవాళ్లను లేకుండా చేయాలనే కుట్రతో పాటు నిర్మాణ పనులలో జాప్యం చేస్తూ కాలం వెలదీస్తున్నారని అన్నారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ ఆసుపత్రి నిర్మాణం విషయంలో కమిషన్లకు కక్కుర్తి పడి ఆలస్యం చేస్తున్నారని ఆరోపించారు. అల్వాల్ టీమ్స్ ఆసుపత్రిని వీలైనంత త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం క్రెడిట్ కోసం మాత్రమే తాపత్రయపడుతోందని,




ఆసుపత్రి నిర్మించిన క్షనత మాత్రం గత బిఆర్ఎస్ ప్రభుత్వానికి దక్కుతుందని అన్నారు.

# మహబూబాబాద్ జిల్లా సెక్రటరీగా కోదాటి వెంకన్న పేరును అధికారికంగా ప్రకటించిన ఉద్యమకారుల ఫోరం

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 29, మహబూబాబాద్ జిల్లా :** మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం ములకలపల్లి గ్రామానికి చెందిన సీనియర్ తెలంగాణ ఉద్యమకారుడు కోదాటి వెంకన్నను మహబూబాబాద్ జిల్లా ఉద్యమకారుల సంఘం జిల్లా సెక్రటరీగా బుధవారం అధికారికంగా ప్రకటించారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన అందించిన సేవలు, ఉద్యమకారుల పక్షాన నిరంతరం చేసిన కృషిని గుర్తించిన రాష్ట్ర నాయకత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. రాష్ట్ర ఉద్యమకారుల ఫోరం అధ్యక్షుడు చీమా శ్రీను, రాష్ట్ర నాయకుడు రంజిని కాంత్, జిల్లా అధ్యక్షుడు ముద్దగాని వెంకటేశ్వర్లు సమక్షంలో ఈ ప్రకటన వెలువడింది. కోదాటి వెంకన్నకు అప్పగించిన బాధ్యతలతో జిల్లా వ్యాప్తంగా ఉద్యమకారులను సమన్వయం చేస్తూ సంఘం బలోపేతానికి కృషి చేయాలని నాయకత్వం ఆకాంక్షించింది. ఈ సందర్భంగా కోదాటి వెంకన్న మాట్లాడుతూ, తనపై విశ్వాసం ఉంచి జిల్లా సెక్రటరీ బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తన ఎంపికకు సహకరించిన ఉద్యమ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు మరియు ములకలపల్లి గ్రామ ప్రజలందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఉద్యమకారుల సమస్యల పరిష్కారం, వారి సంక్షేమం, తెలంగాణ ఉద్యమ ఆశయాల పరిరక్షణ కోసం అంకితభావంతో పనిచేస్తానని కోదాటి వెంకన్న పేర్కొన్నారు. ఫోరం మరింత బలోపేతం చేస్తూ ఉద్యమ స్ఫూర్తిని భావితరాలకు చేరవేయడమే తన లక్ష్యమని తెలిపారు. కోదాటి వెంకన్న నియామకాన్ని జిల్లా వ్యాప్తంగా ఉద్యమకారులు స్వాగతిస్తూ అభినందనలు తెలిపారు.





ఆయన నాయకత్వంలో ఫోరం మరింత చురుకుగా పనిచేసి ఉద్యమకారుల సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషిస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు

# కొంపల్లిలో వైభవంగా ఆషాడ మాస బోనాల జాతర

### ఎ.ఎం.ఆర్ గార్డెన్లో తెలంగాణ సాంస్కృతిక కార్యక్రమాలు

### మామిండ్ల సందీప్ ఆధ్వర్యంలో కార్యక్రమ ఏర్పాట్లు

**జూలై 29, కొంపల్లి, హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కుతుబుల్లాపూర్ నియోజక వర్గంలోని కొంపల్లి పట్టణంలోని ఏ.ఏం.ఆర్ గార్డెన్స్ లో సి.జీ.ఎన్ కల్చరల్ అసోసియేషన్ సభ్యుల మరియు ఎస్.ఎం న్యూస్ మేనేజింగ్ డైరెక్టర్ మామిండ్ల సందీప్ ఆధ్వర్యంలో ఆషాడ మాస బోనాల జాతర 2026 ఘనంగా నిర్వహించారు.ఈ ఆషాడ మాస బోనాల జాతర 2026 సాంస్కృతిక ఉత్సవాలలో ముఖ్య అతిధిగా పాల్గొన్న మాజీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సారథి సభ్యులు దరువు అంజన్న, కొంపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆదిరెడ్డి మోహన్ రెడ్డి,జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బైరి ప్రశాంత్ గౌడ్, అన్నారం గోపాల్ రెడ్డి,జిల్లా లేబర్ సెల్ అధ్యక్షులు కందాడి సుదర్శన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఉపేందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు జయభేరి గోపాల్ రెడ్డి, అంజి ముదిరాజ్, పూర్ణచందర్, శ్రీనివాస్ గౌడ్, ఎర్రోళ్ల కృష్ణ నేతృత్వంలో, స్థానిక మేడ్చల్ జిల్లా బిజెపి పార్టీ ఉపాధ్యక్షులు ఆదిరెడ్డి రాజిరెడ్డి పట్టణ అధ్యక్షులు పెద్ద బుద్ధుల సతీష్ సాగర్ మాజీ పట్టణ అధ్యక్షులు జనార్దన్ రెడ్డి, మహేందర్, బిజెపి నాయకుల సహకారంతో ఎస్.ఎం న్యూస్ ఛానల్, టీ.ఆర్ 9 టీవీ న్యూస్ ఛానల్ సంయుక్త ప్రసారంలో బోనాల జాతర ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సాంస్కృతిక శాఖ సలహా మండలి సభ్యులు దరువు అంజన్న, నేర్నాల కిషోర్ ,భాస్కర స్వర రాగ సంస్థ అధ్యక్షులు భాస్కర రావు, శ్రీమాతా సద్గురు మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ అధ్యక్షురాలు సంగీత నిత్య గురువు అవార్డు గ్రహీత బి.కే అపర్ణ న్యాయ నిర్ణేతలుగా విచ్చేశారు. ఏ.ఏం.ఆర్ గార్డెన్లో అంగరంగ వైభవంగా, భక్తి శ్రద్ధలతో ప్రత్యేక అమ్మ వారి ఘటలతో అలంకరించి ప్రత్యేక సభ స్థలంలో వెచ్చేసి అసోసియేషన్ సభ్యులచే శాలువా మరియు జ్ఞాపికాలతో సత్కరించారు. ఈ సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి విచ్చేసి ఆషాడ బోనాల జాతర 20 26 కార్యక్రమంలో ఒగ్గు డప్పు కళాకారులు మరియు చిన్నారులచే కూచిపూడి భరతనాట్యం, మహిళలచే అమ్మ వారి వేషం, పోతురాజుల నృత్యాలు బోనాల ప్రదర్శన, అంతకంటే ఎక్కువగా నందమూరి తారక రామారావు వేషధారణలో సికింద్రాబాద్ వాసి ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి దిక్సూచిగా కార్యక్రమ నిర్వహణ బాధ్యతలను భుజాలపై మోసి విజయవంతం కావడానికి కృషిచేసిన టి.జి.ఎన్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షురాలు సభావాత్ నందిని మరియు కమిటీ సభ్యులు కార్తీక్ గౌడ్ హేమంత్ కుమార్, మహేష్, సునీత, రఘూన్సీ, రోహిత్ చంద్రశేఖర్, ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ ఆషాడ మాస బోనాల జాతర 2026 ప్రోగ్రాంలో మొదటి విజేతగా ధనలక్ష్మి, రెండవ విజేతగా సునీత, మూడవ విజేతగా సురేష్ గెలుపొందిన వారికీ ప్రముఖలచే శాలువా మరియు జ్ఞాపికాలతో సత్కరించారు అలాగే ప్రోగ్రాంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి శాలువా జ్ఞాపికాలను టీ.జి.ఎన్. కల్చరల్ అసోసియేషన్ సభ్యులు ప్రధానం చేసారు. అనంతరం కళాకారులకు భోజన సదుపాయాలను ఏర్పాటు చేశారు.




# ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును రక్షించుకోవాలి

### ప్రతి ఒక్క ఓటరు ఎస్ఐఆర్ కార్యక్రమంలో పాల్గొని ఓటు హక్కును సంరక్షించుకోవాలి

### మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ కార్యకర్తల పనితీరు అద్భుతం

**బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకులు దాసరి మల్లేశం**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 29, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : యాదగిరిగుట్ట** పట్టణంలో భారతీయ జనతా పార్టీ ఎస్ఐఆర్ మండల ప్రభారీ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ముఖ్యఅతిథిగా బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకులు దాసరి మల్లేశం పాల్గొన్నారు. పట్టణ కార్యాలయంలో సమావేశం నిర్వహించి పట్టణంలోని అన్ని బూతులను సందర్శిస్తూ బిఎల్ఓ లను ఎస్ఐఆర్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకులు దాసరి మల్లేశం మాట్లాడుతూ... ప్రతి ఒక్క ఓటరు ఎస్ఐఆర్ లో పాల్గొనాలని తమ ఓటు హక్కును రక్షించుకోవాలని తెలియజేశారు. అలాగే పట్టణంలోని భారతీయ జనతా పార్టీని ఇంకా బలంగా చేయాలని మున్సిపల్ ఎన్నికల్లో కార్యకర్తల పనితీరు అద్భుతమని కొనియాడారు. ఇలాగే ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్టేట్ కౌన్సిల్ నెంబర్ రచ్చ శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు కర్రె ప్రవీణ్ కుమార్ జిల్లా కార్యవర్గ సభ్యులు భువనగిరి శ్యాంసుందర్, బెలిదే అశోక్, పట్టణ కౌన్సిలర్ బోడ రాధ సురేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి మందోజి నరేష్, పలుగుల సురేష్, ఉపాధ్యక్షులు ఆలేటి కర్ణ, మిర్యాల కృష్ణ, చిత్తర్ల కృష్ణ, కార్యదర్శులు ఆవుల సత్యనారాయణ, గాదె వంశీ, దోమ్మాట ప్రభాకర్, సుదగాని శివ, విజయ్, ప్రవీణ్, శంకర్ చారి తదితరులు పాల్గొన్నారు





# గురు పౌర్ణమి వేళ సాయిబాబా సేవలో ఎమ్మెల్యే మల్లా రెడ్డి

### మేడ్చల్ పట్టణంలోని సాయి బాబా ఆలయంలో ప్రత్యేక పూజలు





**జూలై 29, మేడ్చల్, హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :** గురు పౌర్ణమి పర్వదిన సందర్భంగా సాయిబాబాను దర్శించుకున్న మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి.మేడ్చల్ పట్టణంలో గురు పౌర్ణమి సందర్భంగా సాయిబాబా దేవాలయంలో నిర్వహిస్తున్నటువంటి గురు పౌర్ణమి వేడుకలో మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి పాల్గొన్నారు. ఎమ్మెల్యే మల్లారెడ్డి సాయి బాబాను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఘనంగా సత్కరించారు. మల్లారెడ్డి మాట్లాడుతూ ప్రజలందరికీ గురు పౌర్ణమి శుభాకాంక్షలు తెలుపుతూ, ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని, వానలు బాగా కురవాలని సాయి బాబాని వెడుకున్నట్లు తెలిపారు. ఈ వేడుకలలో మేడ్చల్ పట్టణ బి.ఆర్.ఎస్ శ్రేణులు,ప్రముఖులు మరియు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రజల్లో బ్యాంకింగ్ సేవలపై చైతన్యం.. కస్నం తండాలో ఆర్థిక అక్షరాస్యత సదస్సు



**హైదరాబాద్ పల్స్, జూలై 29, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:** గ్రామీణ ప్రజలకు బ్యాంకింగ్ సేవలపై అవగాహన పెంపొందించి, పొదుపు సంస్కృతిని ప్రోత్సహించే లక్ష్యంతో వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డోర్నకల్ శాఖ) ఆధ్వర్యంలో, నాబార్డ్ ఆర్థిక సహకారంతో మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం కస్నం తండా గ్రామంలో బుధవారం ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ బ్యాంకు శాఖ మేనేజర్ అయూబ్ మాట్లాడుతూ ప్రతి కుటుంబం బ్యాంకు ఖాతాను కలిగి ఉండడం, క్రమం తప్పకుండా పొదుపు చేయడం వల్ల ఆర్థిక భద్రతతో పాటు భవిష్యత్ అవసరాలకు అండగా నిలుస్తుందని తెలిపారు. స్థిర నిక్షేపాల ప్రాముఖ్యతను వివరించడంతో పాటు ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన వంటి సామాజిక భద్రతా పథకాల ప్రయోజనాలను గ్రామస్తులకు వివరించారు. అదేవిధంగా కేవైసీ, ఈ-కేవైసీ ప్రక్రియల అవసరం, బ్యాంకు ద్వారా అందిస్తున్న వివిధ రకాల రుణ సౌకర్యాలు, రైతులు, మహిళలు, స్వయం సహాయక సంఘాలు పొందగల ఆర్థిక సేవలపై సమగ్రంగా అవగాహన కల్పించారు. బ్యాంకింగ్ సేవలను సద్వినియోగం చేసుకుని ప్రతి కుటుంబం ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శంకర్, పంచాయతీ కార్యదర్శి మయూరి, దాసు, సంపత్‌తో పాటు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బ్యాంక్ కాలనీలో మహిళలచే సాయిబాబా వ్రతం


### వసంత లక్ష్మి విద్యాసాగర్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం



**జూలై 29, సుచిత్ర, హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :** గురు పౌర్ణమి సందర్భంగా బుధవారం బ్యాంక్ కాలనీలోని సాయిబాబా గుడిలో గురు పౌర్ణమి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. సాయిబాబా గుడిలో మహిళాలచే సాయిబాబా వ్రతాన్ని చేయించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్క భక్తుడికి సాయిబాబా కృప, ఆశీస్సులు ఉండాలని కోరుకుంటు వసంత లక్ష్మి విద్యాసాగర్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమంలో బి.ఆర్.ఎస్. సీనియర్ నాయకుడు బ్యాంక్ కాలనీ ప్రెసిడెంట్ గంధం సుధాకర్ గౌడ్, జనరల్ సెక్రటరీ కృష్ణకుమార్ గౌడ్, జగదీశ్వర్ రావు, బాలయ్య, బసంత్, సత్యనారాయణ రెడ్డి మరియు కాలనీవాసులు పాల్గొన్నారు.

# ఓటర్లకు అనుకూలంగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయండి

**పెద్దబుద్ధుల సతీష్ సాగర్ (కొంపల్లి బీజేపీ అధ్యక్షులు)**



**జూలై 29, కొంపల్లి, హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :**
కొంపల్లి డివిజన్ పరిధిలో జరుగుతున్న ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం (సర్ ) కార్యక్రమం యొక్క క్షేత్రస్థాయి పనితీరు మరియు నవీకరణలు గురించి నేడు కొంపల్లి బీజేపీ నాయకులు స్థానిక డిప్యూటీ కమిషనర్ లావణ్య తో చర్చించారు. ఈ సందర్భంగా సతీష్ సాగర్ మాట్లాడుతూ ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించి ఉత్తమ ప్రతిభ కనబరిచేలా కృషిచేస్తున్నందుకు గాను కమిషనర్ కి అభినందనలు తెలిపారు. గతంలో ఓటర్లు ఒక ప్రాంతంలో వారి యొక్క ఓటు వేరొక పోలింగ్ కేంద్రంలో ఉండటం వలన ఓటర్లు వారి ఓటు హక్కును వినియోగించుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తద్వారా పోలింగ్ శాతం కూడా తగ్గిన చరిత్ర ఇక్కడ ఉన్నది. ఇప్పుడు జరుగుతున్న ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ అనంతరం ఓటర్లు అందరూ వారి ఓటు హక్కును వినియోగించుకునేందుకు సౌకర్యంగా ఉండేలా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ అర్బన్ జిల్లా ఉపాధ్యక్షులు ఆదిరెడ్డి రాజిరెడ్డి, జిల్లా నాయకులు గోనె మల్లారెడ్డి, సరిత రావు,శంకర్ నాయక్, మహేందర్ సాగర్, శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# భవిష్యత్‌కు బాటలు వేసిన ఎస్పీ సందేశం.. విద్యార్థుల్లో నూతన ఉత్సాహం




**హైదరాబాద్ పల్స్, జూలై 29, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:**
మహబూబాబాద్ పట్టణంలో బుధవారం నిర్వహించిన విద్యార్థుల అవగాహన, ప్రేరణాత్మక కార్యక్రమంలో జిల్లా పోలీసు సూపరింటెండెంట్ డాక్టర్ శబరిష్ పాల్గొని విద్యార్థులకు విలువైన సందేశాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో డోర్నకల్ మండలం చిలుకోడు గ్రామంలోని లిటిల్ మైండ్ హై స్కూల్‌కు చెందిన 9వ, 10వ తరగతి విద్యార్థులు పాల్గొని ఎస్పీ ప్రసంగాన్ని ఆసక్తిగా ఆలకించారు. విద్యార్థి దశలో క్రమశిక్షణ, లక్ష్యసాధన, సమయపాలన, నైతిక విలువలు అలవర్చుకోవడం జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవడానికి పునాదిగా నిలుస్తాయని ఎస్పీ డాక్టర్ శబరిష్ పేర్కొన్నారు. చదువుతో పాటు వ్యక్తిత్వ వికాసం, సమాజం పట్ల బాధ్యత, చట్టాల పట్ల గౌరవం, సైబర్ నేరాలపై అవగాహన ప్రతి విద్యార్థికి అవసరమని సూచించారు. మత్తు పదార్థాలు, చెడు అలవాట్లు, సామాజిక మాధ్యమాల దుర్వినియోగానికి దూరంగా ఉండి, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో కష్టపడి చదివితే ప్రతి విద్యార్థి తన కలలను సాకారం చేసుకోగలడని ఆయన అన్నారు. యువత తమ శక్తి, ప్రతిభను దేశాభివృద్ధికి ఉపయోగించేలా తీర్చిదిద్దుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో లిటిల్ మైండ్ హై స్కూల్ ప్రిన్సిపాల్ గోగుల మల్సూర్, పాఠశాల ఉపాధ్యాయురాలు తదితరులు పాల్గొన్నారు.

విలేకరులు కావలెను
హైదరాబాద్ పల్స్
జాతీయ తెలుగు దినపత్రిక
"ఎంతకైనా తెగిస్తాం... ప్రజల గొంతుకై నిలుస్తాం" అనే నినాదంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన హైదరాబాద్ పల్స్ జాతీయ దినపత్రికకు తెలుగు రాష్ట్రాలలోని అన్ని మండల, నియోజకవర్గాల, జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను. * సీనియర్లకు ప్రాధాన్యత కలదు.
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్
- Dr. RAHUL KUMAR 9989834020
- K. Naveen Kumar 94406 53413
www.hyderabadpulse.com HyderabadPulse @hyderabad

# కర్ణాటకలో సంచలనం.. 7 వేల మంది విద్యార్థులకు హెచ్.ఐ.వీ పాజిటివ్

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 29, సెంట్రల్ డెస్క్ :**
హెచ్.ఐ.వీ పాజిటివ్ కేసులకు సంబంధించి కర్ణాటక రాష్ట్రంలో ఇటీవల వెలుగుచూసిన ఒక సంచలనాత్మక నివేదిక తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. రాష్ట్రంలోని యువత, ముఖ్యంగా విద్యార్థులు పెద్ద సంఖ్యలో హెచ్ఐవీ బారిన పడుతున్నట్లు ఆరోగ్య శాఖ నిర్వహించిన సర్వేల్లో బహిర్గతమైంది. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన వివిధ హెల్త్ అవేర్నెస్ క్యాంపెయిన్లలో భాగంగా సేకరించిన నమూనాలను విశ్లేషించగా, రాష్ట్రవ్యాప్తంగా ఏకంగా 7,000 మంది విద్యార్థులు హెచ్ఐవీ పాజిటివ్‌గా తేలినట్లు రావడంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. ఇంత చిన్న వయస్సులోనే వేలాది మంది విద్యార్థులు ఈ మహమ్మారి బారిన పడటం పట్ల ఆరోగ్య నిపుణులు, తల్లిదండ్రులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆందోళనకర పరిస్థితులను సీరియస్‌గా తీసుకున్న కర్ణాటక ప్రభుత్వం, రాష్ట్రంలో హెచ్ఐవీ వ్యాప్తిని ప్రాథమిక దశలోనే అరికట్టేందుకు తక్షణ చర్యలు చేపట్టింది. అందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని విద్యాసంస్థల్లో ఉచిత పరీక్షా శిబిరాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించింది. ఇంటర్మీడియట్, డిగ్రీ, ఇంజనీరింగ్ తో పాటు ఇతర వృత్తి విద్యా కళాశాలల్లో ప్రత్యేక స్క్రీనింగ్ క్యాంపులతో పాటు, హెచ్ఐవీ వ్యాప్తి చెందే మార్గాలు, నివారణ మార్గాలపై విద్యార్థులకు సమగ్ర అవగాహన సదస్సులు




నిర్వహించాలని ఆరోగ్య శాఖకు స్పష్టమైన ఉత్తర్వులు జారీ అయ్యాయి. త్వరలోనే ఈ ప్రత్యేక డ్రైవ్‌ను రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసేందుకు ఆరోగ్య, విద్యా శాఖల అధికారులు సమాయత్తమవుతున్నారు.

## సైబర్ మోసాల కేసుల్లో తెలంగాణ టాప్..

# పార్లమెంట్?కు కేంద్రం సమాధానం

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 29, తెలంగాణ బ్యూరో:**
దేశంలో 2020 నుంచి 2024 మధ్య కాలంలో సైబర్ మోసాలు మూడింతలు పెరిగాయని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. 2024 నాటికి అత్యధికంగా 18,922 సైబర్ కేసుల నమోదుతో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని పేర్కొంది. ఆ తర్వాతి స్థానాల్లో బీహార్ (4,020), మహారాష్ట్ర (2,827), ఒడిశా (1,546) నిలిచాయని తెలిపింది. ఈ మేరకు రాజ్యసభలో ఒక ప్రశ్నకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. సైబర్ నేరాల్లో ఎంత డబ్బు కోల్పోయారు లేదా ఎంత రికవరీ చేశారనే పూర్తి సమాచారాన్ని ఎన్‌సీఆర్‌బీ ప్రత్యేకంగా నిర్వహించదని మంత్రి స్పష్టం చేశారు.

**ఏటికేడు పెరుగుతున్న సైబర్ మోసాలు:**
సైబర్ నేరాలు ఏటికేడు పెరుగుతున్నట్లు కేంద్రం పేర్కొంది. 2020లో దేశవ్యాప్తంగా 10,395 కేసులు నమోదు కాగా 2021లో 14,007 కేసులు, 2022లో 17,470, 2023లో 19,466, 2024లో 29,758 కేసులు నమోదైనట్లు తెలిపింది. వీటిలో సైబర్ నేరాల్లో అత్యధికంగా ఆన్‌లైన్ బ్యాంకింగ్ ఫ్రాడ్స్ అత్యధికంగా ఉన్నట్లు తెలిపింది. 2024లో ఆన్‌లైన్ బ్యాంకింగ్ ఫ్రాడ్స్ కేసులు 4,659 నమోదు కాగా, క్రెడిట్/డెబిట్ కార్డ్ మోసాలు 3,829, మార్కెటింగ్/పెట్టుబడుల పేరిట మోసాలు 3,044, ఏటీఎం మోసాలు 1,659, ఫేక్ కాల్స్/విషింగ్ 1,264, గేమింగ్ యాప్స్/వెబ్‌సైట్ మోసాలు 1,019, ఓటీపీ ఫ్రాడ్స్ 965, ఈ-వాలెట్/యూపీఐ మోసాలు: 723 నమోదైనట్లు వెల్లడించింది.

**నివారణ చర్యలు:**
సైబర్ నేరాలను అరికట్టేందుకు కేంద్ర హోంశాఖ




ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (×4సి)ని ఏర్పాటు చేసిందని మంత్రి బండి సంజయ్ తెలిపారు. 'సిటిజన్ ఫైనాన్షియల్ సైబర్ ఫ్రాడ్ రిపోర్టింగ్ అండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్' ద్వారా 2026 జూన్ 30 నాటికి సుమారు 32.80 లక్షల ఫిర్యాదులకు సంబంధించి రూ.11,158 కోట్లకు పైగా బాధితుల సొమ్ము కాపాడగలిగినట్లు ఆయన పేర్కొన్నారు.

# రైతుకు కేంద్ర సబ్సిడీ ఇవ్వడంలో అలసత్వం.. బ్యాంకు తిక్క కుదిర్చిన కోర్టు

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 29, సెంట్రల్ బ్యూరో:**
పాడి రైతుకు రావలసిన కేంద్ర ప్రభుత్వ సబ్సిడీని సకాలంలో అందించడంలో నిర్లక్ష్యం వహించినందుకు బ్యాంక్ తిక్క కుదిర్చింది జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్. బ్యాంకు సొంత విధానపరమైన వైఫల్యాల కారణంగా రైతు నష్టపోవాల్సి వచ్చిందని అందువల్ల సదరు రైతుకు 1.76 లక్షలు చెల్లించాలని తాజాగా ఆదేశించింది. కేరళలో వెలుగు చూసిన ఈ కేసు వివరాలు ఇలా ఉన్నాయి. కేరళలోని కాసరగోడ్‌కు చెందిన జేమ్స్ థామస్ అనే పాడి రైతు 2017లో కేంద్ర ప్రభుత్వం నాబార్డ్ ద్వారా ప్రవేశపెట్టిన 'డైరీ ఆంత్రప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ స్కీమ్' గురించి తెలుసుకున్నారు. ఈ పథకం కింద రుణంపై 25 శాతం సబ్సిడీ లభిస్తుంది. దీనికోసం ఆయన చెరుపుళలోని ఫెడరల్ బ్యాంక్‌ను సంప్రదించగా, బ్యాంక్ ఆయనకు రూ.3.75 లక్షల వ్యవసాయ రుణం మంజూరు చేసింది. ఈ రుణంతో పాటు రూ. 1,26,500 నాబార్డ్ సబ్సిడీ కూడా వస్తుందని బ్యాంక్ హామీ ఇచ్చింది. తనకు ఏ ఉద్దేశంతో రుణం మంజూరు చేశారో అందుకోసమే థామస్ ఆ డబ్బును వినియోగించాడు. వాటితో 5 ఆవులు కొనుగోలు చేసి, పాక నిర్మించుకున్నాడు. ఆ తర్వాత పాడి ఆదాయం నుంచి క్రమంగా రుణం తిరిగి




చెల్లిస్తూ వచ్చారు. కానీ సబ్సిడీ మాత్రం ఖాతాలో జమ కాలేదు.

**తానే స్వయంగా రంగంలోకి:**
తనకు రావల్సిన సబ్సిడీ గురించి సదరు రైతు బ్యాంకును సంప్రదించిన ప్రతిసారీ నిధులు రాలేవని, నాబార్డ్ ఫండ్స్ అయిపోయాయని అతనికి చెప్పి పంపిస్తున్నారు. ప్రతిసారి తనను తిప్పి పంపుతుండటంతో ఓ సారి బ్యాంక్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా వారు కూడా అతడికి ఎటువంటి సమాధానం ఇవ్వలేదు. దీంతో బ్యాంక్ నిర్లక్ష్యంతో విసిగిపోయినా థామస్ స్వయంగా నాబార్డ్ వెబ్‌సైట్‌లో పరిశీలించగా బ్యాంకు చెబుతున్నదానికి వాస్తవానికి విరుద్ధంగా ఉంది. 2020 వరకు రావలసిన సబ్సిడీ నిధులన్నింటినీ నాబార్డ్ తన భాగస్వామ్య బ్యాంకులకు విడుదల చేసింది. దీంతో నిధులు విడుదలైనప్పటికీ అబద్దాలతో బ్యాంకు తనను మోసం చేసిందంటూ జేమ్స్ థామస్ 2024లో వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు.


**బ్యాంకు లోపంతో రైతుకు తిప్పలు:**
బ్యాంక్ సరైన ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా కాకుండా పాత పద్ధతిలో దరఖాస్తు పంపించగా నాబార్డ్ దానిని తిరస్కరించి ఆన్‌లైన్‌లో పంపాలని చెప్పినా బ్యాంక్ స్పందించలేదని విచారణలో తేలింది. జులై 2025 నాటికి కూడా నాబార్డ్ అడిగిన వివరాలను ఫెడరల్ బ్యాంక్ సమర్పించలేదని ఆధారాలతో సహా నిరూపితమైంది. బ్యాంకు యొక్క సొంత విధానపరమైన వైఫల్యాల కారణంగా అతను ఆ ప్రభుత్వ సబ్సిడీని పొందలేకపోయాడని తేలడంతో కేరళ వినియోగదారుల కమిషన్ ఆ బ్యాంకును రూ. 1.76 లక్షలు చెల్లించాలని ఆదేశించింది. రైతుకు రావలసిన సబ్సిడీ మొత్తం రూ.1,26,500 తో పాటు, ఆయనకు కలిగిన మానసిక వేదనకు గాను రూ.50,000 పరిహారం కలిపి మొత్తం రూ. 1,76,500 ను రైతుకు చెల్లించాలని ఫెడరల్ బ్యాంక్‌ను ఆదేశించింది. ఆదేశాలు అందిన నెల రోజుల్లోగా ఈ మొత్తాన్ని చెల్లించకపోతే ఆర్డర్ తేదీ నుండి 12 శాతం వార్షిక వడ్డీతో కలిపి చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించింది.

# పిల్లల వాక్సినేషన్ విభాగంలో అరకొర వసతులు

**వార్డు కార్యాలయం వసతులపై తల్లిదండ్రుల ఆవేదన**

**జూలై 29, ఓల్డ్ బోయిన్పల్లి, హైదరాబాద్ పల్స్ న్యూస్:**
కూకట్పల్లి నియోజక వర్గంలోని బాల నగర్ మండంలోని ఓల్డ్ బోయిన్పల్లి వార్డు కార్యాలయంలో చిన్న పిల్లల వాక్సినేషన్ విభాగంలో సరైన వసతులు లేక తీవ్ర అవస్థలు పడుతున్న తల్లిదండ్రులు. బుధవారం రోజు మాత్రమే వేసే వాక్సినేషన్ వల్ల ఓల్డ్ బోయినపల్లి 262 డివిజన్ ప్రాంత ప్రజల పిల్లల పుట్టిన వయస్సు నుండి పది సంవత్సరాల వరకు వాక్సినేషన్ చిన్న పిల్లలకు టీకాలు పిల్లలకు వయసు వారీగా అందించే ప్రధాన టీకాల షెడ్యూల్‌లో పుట్టిన వెంటనే బీసీజీ, హెపటైటిస్-బి, పోలియో చుక్కలు; 6, 10, 14 వారాల్లో పెంటావాలెంట్, రోటావైరస్; అలాగే 9 నుంచి 12 నెలల మధ్య మీజిల్స్-రుబెల్లా (ఎం ఆర్) టీకాలు తప్పనిసరిగా వేయించాలి. వయసుల వారీగా టీకాల వారిగా బీసీజీ (టీబీ కొరకు), హెపటైటిస్-బి (మొదటి డోస్), మరియు ఓరల్ పోలియో వ్యాక్సిన్ (ఒపీవీ ),6 నుండి 10, మరియు 14 వారాలలో పెంటావాలెంట్ (డిఫ్తీరియా, కోరింత దగ్గు, ధనుర్వాతం, హెపటైటిస్-బి, హిబ్), రోటావైరస్, మరియు ఐపీవీ/ఓపీవీ పోలియో చుక్కలు.9 నుండి 12 నెలలలో ఎం.ఆర్ (మీజిల్స్-రుబెల్లా) మొదటి డోస్ మరియు పీసీవీ బూస్టర్.16 నుండి 24 నెలలో డీపీటీ బూస్టర్, పోలియో బూస్టర్, మరియు ఎం. ఆర్ రెండో డోస్.4 నుండి 6 సంవత్సరాలలో డీపీటీ మరియు పోలియో బూస్టర్ డోసులు వేయిస్తారు. బుధవారం రోజున స్థానికంగా ఉన్నటువంటి ప్రభుత్వ కార్యాలయాలలో, అంగన్వాడీ కేంద్రాలలో చిన్న పిల్లలకు టీకాలు ఆయాలు వేస్తారు. ఈ క్రమంలో చిన్న పిల్లల తాకిడి ఎక్కువగా ఉండడం, ఇప్పుడున్న వార్డు కార్యాలయంలో అరకొర వసతులతో (సిబ్బంది, కుర్చీలు, ఫాన్స్, లైట్స్ ) ఇబ్బంది పడుతున్నారు.హైదరాబాద్ పల్స్ పత్రిక ప్రతినిధి బుధవారం వార్డు కార్యాలయాన్ని సందర్శించి అక్కడ





ఉన్న చిన్న పిల్లల తల్లిదండ్రులను వసతులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని తగిన వసతులు ఏర్పాటు చేయాలని వేడుకున్నారు.

# పాక్ రక్షణ మంత్రి వివాదాస్పద కామెంట్స్.. "వారు భారత్ లాంటి శత్రువులే"

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 29 :**
పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్ (పీవోకే)లో గత కొంతకాలంగా పరిస్థితులు తీవ్ర ఉద్రిక్తంగా మారాయి. పాకిస్థాన్ ప్రభుత్వం సాగిస్తున్న అణచివేత చర్యలకు వ్యతిరేకంగా స్థానిక ప్రజలు, తీవ్ర ఆందోళనలు వ్యక్తం చేస్తూ రోడ్లపైకి వస్తున్నారు. ఈ క్రమంలో పాకిస్థాన్ సైన్యం జరిపిన కాల్పుల్లో ఇప్పటివరకు అనేకమంది పౌరులు ప్రాణాలు కోల్పోయారు. ఈ పరిణామాలపై స్పందించిన పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్.. పాక్ సైన్యం చర్యలను సమర్థిస్తూ చేసిన కామెంట్స్ తీవ్ర దుమారాన్ని రేపుతున్నాయి. పీవోకేలోని రావల్కోట్, మీర్‌పూర్ ప్రాంతాల్లో చెలరేగిన హింసాకాండలో దాదాపు 32 మందికి పైగా కాశ్మీరీ నిరసనకారులు ప్రాణాలు కోల్పోయిన నేపథ్యం పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ స్పందించారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఓ వీడియోలో.. ఆయన నిరసనకారులను "భారత్ లాంటి శత్రువులు"గా చూస్తున్నానని వ్యాఖ్యానించి మరోసారి వివాదంలో చిక్కుకున్నారు. "నేను ఆజాద్ కాశ్మీర్ నిరసనకారులను భారతదేశంతో సమానంగా చూస్తాను. వారిని కూడా భారత్‌లాగే శత్రువులుగా పరిగణిస్తాను," అని పాకిస్తాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ వైరల్ అవుతున్న ఆ వీడియోలో అన్నారు. మరోవైపు ఆయన పాక్ సైన్యం జరిపిన క్రూరమైన హత్యలను సమర్థించుకోవడానికి ప్రయత్నించారు.

**పీవోకేలో అశాంతి:**




పాక్ ఆక్రమిత కాశ్మీర్లో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనల్లో జూన్ 5 నుంచి 90 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. మీర్‌పూర్ నగరంలో పాకిస్తానీ భద్రతా సిబ్బంది పౌరులపై బహిరంగంగా కాల్పులు జరపడం, ఆ తర్వాత మృతదేహాలను తమ వాహనాల్లోకి ఎక్కించడం చూపిస్తున్న అనేక వీడియోలు సోషల్ మీడియాలో వెలుగులోకి వచ్చాయి. మృతులలో ఎక్కువ మంది జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ కి చెందిన కార్యకర్తలు ఉండడం గమనార్హం. ఆ ప్రాంతంలో మానవ హక్కుల ఉల్లంఘనలను ఎత్తి చూపినందుకు పాకిస్థాన్ జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ సంస్థను నిషేధించింది. మృతులలో జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ వ్యవస్థాపక సభ్యుడైన ఉమర్ నజీర్ తమ్ముడు ఉస్మాన్ నజీర్ కూడా ఉన్నారు.

**క్రూరమైన హత్యలు:**
జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ తో సహా పలు సోషల్ మీడియా హ్యాండిల్స్‌లో పోస్ట్ చేసిన వీడియోలలో, స్థానికులు తమను తాము రక్షించుకోవడానికి పరుగెడుతుండగా పాకిస్తానీ దళాల క్రూరత్వం కనిపించింది. సోషల్ మీడియాలో షేర్ చేసిన వీడియోలలో రోడ్లపై పడి ఉన్న మృతదేహాలు, ఎక్కడ చూసినా కిందపడిపోయిన మోటార్‌బైక్‌లు కనిపించాయి. పీవోకేలో పాకిస్థాన్ పాల్పడుతున్న మానవ హక్కుల ఉల్లంఘనలకు వ్యతిరేకంగా తమ మద్దతును తెలియజేయడానికి స్థానికులు పెద్ద సంఖ్యలో రోడ్లపైకి వస్తున్నారు. పీవోకేలోని రావల్కోట్‌లో పాకిస్తానీ దళాలు ప్రజలపై కాల్పులు జరిపాయని కూడా జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ ఆరోపించింది. "రావల్కోట్‌లో పరిస్థితి మరోసారి ఉద్రిక్తంగా మారింది. శాంతియుత ప్రజలపై దళాలు షెల్లింగ్, కాల్పులు జరుపుతున్నాయి" అని జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ ఎక్స్ వేదికగా రాసుకొచ్చింది. మీర్‌పూర్ అవామీ యాక్షన్ కమిటీకి చెందిన యువ సభ్యులను పాకిస్తానీ పోలీసు అధికారులు లక్ష్యంగా చేసుకున్నారని ఆరోపణలు వచ్చాయి. పాకిస్థాన్ సర్కారు, పాకిస్థాన్ భద్రతా బలగాలు పీవోకేలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న సొంత ప్రజలను శత్రువులుగా పరిగణించడం, మీడియా ద్వారా తప్పుడు ప్రచారం చేయడం పట్ల అంతర్జాతీయంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అటు పాకిస్థాన్ దళాల షెల్లింగ్, కాల్పుల మధ్య తీవ్ర ఉద్రిక్తతల నేపథ్యంలో కూడా పీవోకే ప్రజలు తమ హక్కుల కోసం పోరాటాన్ని కొనసాగిస్తూనే ఉన్నారు

# విద్యార్థులను కేంద్రం అంధభక్తులుగా మార్చుతోంది : రాహుల్ గాంధీ

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 29, సెంట్రల్ డెస్క్ :**
లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై మరోసారి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దేశంలో పరీక్షల అక్రమాల నిరోధక సవరణ బిల్లుపై జరిగిన చర్చలో పాల్గొన్న ఆయన.. విద్యావ్యవస్థ మొత్తం కూడా రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ గుప్పిట్లోకి వెళ్లిపోయిందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల దేశంలోని విద్యార్థులకు ఆర్ఎస్ఎస్ అసలు శత్రువుగా మారిందని ఆరోపించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై రాహుల్ గాంధీ మాట్లాడారు. ఆయన రాజీనామా పైపైన కనిపించే కంటితుడుపు చర్యలు మాత్రమేనని తేల్చి చెప్పారు. విద్యా శాఖను ధర్మేంద్ర ప్రధాన్ స్వయంగా నడపలేదని, కీ అంతా కూడా ఆయన కార్యాలయంలో ఉన్న ఓ ఓఎస్డీ చేతుల్లోకి వెళ్లిపోయిందని పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో విద్యా మంత్రిత్వ శాఖ నడుస్తోందంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. దేశంలో విద్యార్థులు తమకు నచ్చిన రంగాన్ని ఎంచుకునే పూర్తి స్వేచ్ఛను కోల్పోతున్నారని రాహుల్ గాంధీ ఆవేదన వ్యక్తం చేశారు. నిరంతరం ప్రశ్నించే తత్వాన్ని కేంద్ర ప్రభుత్వం పూర్తిగా అణచివేస్తోందని విమర్శించారు. ఆర్ఎస్ఎస్ తన ఊహాజనిత భావజాలంతో కూడిన అశాస్త్రీయ చరిత్రను విద్యార్థులపై బలవంతంగా రుద్దుతోందని ఆరోపించారు. దేశంలో విద్యార్థులు తమ మనసులోని మాటను ధైర్యంగా చెప్పడానికి, సందేహాలను నివృత్తి చేసుకోవడానికి వీలు లేకుండా ఈ వ్యవస్థ తయారైందని ధ్వజమెత్తారు. గతంలో యూపీఏ హయాంలో లాగా తమ ప్రభుత్వంలో మంత్రులు రాజీనామాలు చేయబోరంటూ కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేసిన వ్యాఖ్యలను రాహుల్ గాంధీ ఈ సందర్భంగా సభలో గుర్తుచేశారు. ఆ వ్యాఖ్యలు నూటికి నూరు శాతం నిజమేనని, ఎందుకంటే ఇక్కడ నిర్ణయాధికారాలు కేంద్ర మంత్రుల చేతుల్లో లేవని ఎద్దేవా చేశారు. ఇదంతా ఒక దోపిడీ వ్యవస్థగా మారిందని, విద్యార్థులను ప్రశ్నించే జ్ఞానం లేకుండా అంధభక్తులుగా మార్చడమే ఆర్ఎస్ఎస్ అంతిమ లక్ష్యమని దుయ్యబట్టారు. నీట్ పేపర్ లీకేజీ అంశాన్నీ రాహుల్ గాంధీ సభలో ప్రస్తావించారు. దేశవ్యాప్తంగా విద్యార్థులు చేసిన ఉద్యమాన్ని హింసగానో, వారి ఆగ్రహంగానో చిత్రీకరించడం తగదని సూచించారు. దేశ యువత తమ ఆశయాలు, ఉజ్వల భవిష్యత్తును కాపాడుకునేందుకు శాంతియుతంగా వ్యక్తం చేసిన నిరసనగా గుర్తించాలని అధికార పక్షానికి హితవు పలికారు. విద్యార్థుల ఆవేదనను, వారి గొంతుకను గౌరవించడం అన్ని రాజకీయ పార్టీల కనీస బాధ్యత అని స్పష్టం చేశారు.



# తెలంగాణ పోలీస్ శాఖ భారీ నోటిఫికేషన్ రిలీజ్




రాష్ట్రంలోని నిరుద్యోగులకు గుడ్ న్యూస్. రాష్ట్రంలో 7,437 పోలీస్ ఉద్యోగాల భర్తీకి తెలంగాణ పోలీస్ శాఖ నోటిఫికేషన్ రిలీజ్ చేసింది. పోలీస్, స్పెషల్ ప్రొటక్షన్ ఫోర్స్, ఫైర్, ఎమర్జెన్సీ, జైలు విభాగాలకు సంబంధించి నాలుగు నోటిఫికేషన్లు ఇచ్చింది. ఈ నోటిఫికేషన్ల ద్వారా మొత్తం 7,437 ఖాళీలను భర్తీ చేయనున్నారు. పోలీస్ శాఖలో ఎస్ ఐ(సివిల్) లో 148, రిజర్వ్ సబ్ ఇన్ స్పెక్టర్ (ఎ.ఆర్) కేటగిరీలో 14, రిజర్వ్ సబ్ ఇన్ స్పెక్టర్(టి జి ఎస్ పి) లో 12, రిజర్వ్ సబ్ ఇన్ స్పెక్టర్(ఎస్ ఎ ఆర్ సి పి ఎల్) విభాగంలో 3, అసిస్టెంట్ సబ్ ఇన్ స్పెక్టర్ లో 23 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ రిలీజ్ అయింది. త్వరలోనే ఈ పరీక్షలకు సంబంధించిన తేదీలను వెల్లడించనున్నారు అధికారులు.

# మాజీ కార్పొరేటర్ నివాసంలో గురు పౌర్ణిమ వేడుకలు

### యోగ గురువుకు గురుపుజోత్సవ కార్యక్రమం

**జూలై 29, ఓల్డ్ బోయిన్పల్లి, హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :**
యోగ సద్గురు మల్లిఖార్జున్ స్వామి గారి సాన్నిధ్యంలో, ముద్దం నర్సింహ యాదవ్ నివాసంలో ముద్దం నర్సింహా యాదవ్ ఆధ్వర్యంలో గురు పౌర్ణిమ వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాస మహర్షి చిత్రపటానికి ముద్దం నర్సింహ యాదవ్, యోగ సద్గురు మల్లిఖార్జున్ స్వామీ కలిసి పుష్పాంజలి ఘటించి నివాళు లర్పించారు. అనంతరం ముద్దం నర్సింహ యాదవ్ యోగ సద్గురు మల్లిఖార్జున్ స్వామిని శాలువాతో ఘనంగా సత్కరించి, గురువు పట్ల తన గౌరవాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా యోగ సద్గురు మల్లిఖార్జున్ స్వామి గురువు యొక్క గొప్పతనం, భారతీయ సంస్కృతిలో గురువు స్థానాన్ని వివరిస్తూ ఆధ్యాత్మిక సందేశాన్ని అందించారు. అనంతరం భజన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు గురువుల ఆశీస్సులు పొందుతూ గురు పౌర్ణిమ వేడుకలను భక్తి శ్రద్ధలతో పాటించారు.



# ఈ20 పెట్రోల్ వినియోగంపై సందేహాలు.. వివరణ ఇచ్చిన కేంద్రమంత్రి గడ్కరీ..

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 29, సెంట్రల్ డెస్క్ :**
ఈ20 పెట్రోల్ వినియోగంపై వాహనదారుల్లో ఉన్న సందేహాలకు కేంద్రం స్పష్టత ఇచ్చింది. భారత్ స్టేజ్-3 (బీఎస్-3) ప్రమాణాలకు చెందిన 2005 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చిన వాహనాల్లో 2016కు ముందు తయారైన కొన్ని మోడళ్లకు మాత్రమే రబ్బరు భాగాలు, గ్యాస్కెట్ల మార్పు అవసరం కావొచ్చని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. రాజ్యసభలో లిఖితపూర్వక సమాధానంలో ఆయన ఈ వివరాలు వెల్లడించారు. ఈ20 (80 శాతం పెట్రోల్, 20 శాతం ఇథనాల్) వినియోగంతో వాహనాల మైలేజీ తగ్గుతుందన్న ఆందోళనలపై స్పందిస్తూ.. వాహనం మైలేజీ కేవలం ఇంధన రకంపైనే ఆధారపడదని, డ్రైవింగ్ విధానం, వాహన పరిస్థితి వంటి అనేక అంశాలు ప్రభావం చూపుతాయని వాహన తయారీ సంస్థలు, టెస్ట్ కంపెనీలు స్పష్టం చేశాయని తెలిపారు. ఈ20 ప్రభావంపై ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీఎల్), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం (ఐఐపీ) డెహ్రాడూన్, సియామ్, ఏఆర్ఏఐ సంయుక్తంగా అధ్యయనం చేశాయని గడ్కరీ పేర్కొన్నారు. ఈ పరిశోధనల్లో కార్లు, ద్విచక్ర వాహనాల ఇంజిన్లలో ఎలాంటి మార్పులు అవసరం లేదని తేలిందన్నారు. పాత వాహనాల పనితీరులోనూ గణనీయమైన మార్పులు, అసాధారణ అరుగుదల కనిపించలేదని చెప్పారు. డ్రైవింగ్ సామర్థ్యం, స్టార్టింగ్ సమస్యలు, మెటల్, ప్లాస్టిక్ భాగాల అనుకూలత వంటి అంశాల్లోనూ ఎలాంటి ఇబ్బందులు గుర్తించలేదని మంత్రి వివరించారు. బీఎస్-3 ప్రమాణాల కిందకు వచ్చే, 2016కు ముందు తయారైన కొన్ని వాహనాల్లో మాత్రమే రబ్బరు భాగాలు, గ్యాస్కెట్లను మార్చాల్సి రావచ్చని, సాధారణ సర్వీసింగ్ సమయంలోనే ఈ పనిని పూర్తి చేయొచ్చని తెలిపారు. ఈ20 ఇంధనంపై ముందస్తు అధ్యయనాలు, పరీక్షలు నిర్వహించిన తర్వాతే దశలవారీగా అమలు చేస్తున్నట్లు కేంద్రం పేర్కొంది. నీతి ఆయోగ్ ఆధ్వర్యంలో 2020 డిసెంబర్ 26న




ఏర్పాటైన అంతర్గత మంత్రిత్వ కమిటీ వాహనాల అనుకూలత, మైలేజీ, ఇంధన సామర్థ్యంపై సమగ్ర అధ్యయనం చేసిందని గడ్కరీ తెలిపారు. ఈ అధ్యయనంలో ఇంజిన్ పనితీరు, ఇంధన వ్యవస్థ, ఉద్గారాలు, మన్నిక, ఇంధన సామర్థ్యం వంటి అంశాలను పరిశీలించినట్లు చెప్పారు. ఇథనాల్ కలిపిన పెట్రోల్ వినియోగం భారత్‌లో కొత్త కాదని మంత్రి తెలిపారు. 2001లో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభమైన ఈ కార్యక్రమంలో 2006లో ఈ5 ఇంధనాన్ని ప్రవేశపెట్టారని, మౌలిక వసతులు, ఉత్పత్తి సామర్థ్యం పెరగడంతో ఇథనాల్ మిశ్రమ శాతం క్రమంగా పెంచామని వివరించారు. ప్రపంచంలోని పలు దేశాలు, ముఖ్యంగా బ్రెజిల్, చాలా కాలంగా ఇథనాల్ మిశ్రమ ఇంధనాన్ని వినియోగిస్తున్నాయని తెలిపారు. కాగా, పాత వాహనాలపై ప్రభావం, మైలేజీ తగ్గుదల, నిర్వహణ ఖర్చులపై ప్రతిపక్షాలు, వినియోగదారుల సంఘాలు ఆందోళనలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో కేంద్రం ఈ వివరణ ఇచ్చింది. ఈ20 ఇంధనంతో నడిచే వాహనాలకు సంబంధించి తయారీ సంస్థలు వారంటీ రూల్స్‌ను కొనసాగిస్తాయని గడ్కరీ వివరించారు.

# పసిడి పుట్టుక ఎలాగో తెలుసా? సైంటిస్టులు కనిపెట్టిన రహస్య "గోల్డ్ కిచెన్"!

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూలై 29 :**
ప్రకృతి ఒడి.. అద్భుతాల గని. పుడమిలో దాగి ఉన్న రహస్యాలు మానవ మేధస్సుకు ఎప్పటికప్పుడు సవాలు విసురుతూనే ఉన్నాయి. మానవాళి అత్యంత విలువైనదిగా భావించే 'పసిడి' అసలు ఎక్కడ, ఎలా తయారవుతుందనే ప్రశ్నకు శాస్త్రవేత్తలు ఒక వినూత్న సమాధానాన్ని కనుగొన్నారు. సముద్ర గర్భంలో చాలా లోతున, అగ్నిపర్వతాలు కొలువై ఉన్న ప్రాంతాల కింద ఒక భారీ "గోల్డ్ కిచెన్" నిరంతరం పనిచేస్తోందని పరిశోధకులు స్పష్టం చేస్తున్నారు. పసిడి కేవలం నేలపైన లేదా కొండల్లో మాత్రమే కాకుండా.. సముద్రాల అడుగున ఉన్న తీవ్రమైన ఉష్ణోగ్రతలు, రాతి పొరల రసాయనిక చర్యల వల్ల భూమి లోతుల్లో అత్యంత సమృద్ధిగా రూపుదిద్దుకుంటోందని నిపుణులు వెల్లడించారు. జర్మనీకి చెందిన 'జియోమార్ హెల్మ్‌హోల్ట్జ్ సెంటర్ ఫర్ ఓషన్ రీసెర్చ్' నిపుణుడు డాక్టర్ క్రిస్టియన్ టిమ్ నేతృత్వంలోని శాస్త్రవేత్తల బృందం ఈ అధ్యయనాన్ని చేపట్టింది. న్యూజిలాండ్ సమీపంలోని సముద్ర గర్భంలో ఉన్న అగ్నిపర్వత శ్రేణుల నుంచి 66 రకాల అరుదైన సాంపుల్స్‌ను వారు సేకరించారు. నీటి అడుగున అగ్నిపర్వతాలు బద్దలైనప్పుడు అత్యంత వేగంగా చల్లబడే లావా.. ప్రత్యేకమైన గాజు రూపంలోకి మారుతుంది. ఈ గాజు నమూనాలను అత్యాధునిక పరికరాలతో విశ్లేషించినప్పుడు శాస్త్రవేత్తలకు దిమ్మతిరిగే నిజాలు తెలిశాయి. ఈ లావా నమూనాల్లో సాధారణ సముద్ర గర్భంలో ఉండే పసిడి పరిమాణం కంటే అనేక రెట్లు ఎక్కువ స్థాయిలో బంగారం ఆనవాళ్లు లభించాయి.

**ఒక్కసారి కాదు.. మళ్లీ మళ్లీ కరిగితేనే కమ్మనైన పసిడి!**
భూమి లోపలి పొరల్లో బంగారం ఎలా సమృద్ధిగా చేరుతుందో వివరిస్తూ శాస్త్రవేత్తలు ఒక ఆసక్తికరమైన విషయాన్ని వెల్లడించారు. సముద్ర పలకలు ఒకదాని కిందకు మరొకటి నెట్టివేసే క్రమంలో తీవ్రమైన వేడి, నీటి ఉనికి వల్ల భూమి లోపలి పొరలు కరగడం ప్రారంభిస్తాయి. ఈ కరిగే ప్రక్రియ ఒకే ఒక్కసారి కాకుండా.. పదే పదే జరగడం వల్ల బంగారం శాతంలో తీవ్ర మార్పులు వస్తాయి. భూమి పొరల్లోని సల్ఫైడ్ ఖనిజాలు అధిక ఉష్ణోగ్రతల వద్ద పూర్తిగా కరిగిపోయి, వాటిలో దాగి ఉన్న బంగారం మొత్తాన్ని క్రమంగా లావాలోకి విడుదల చేస్తాయి. ఈ బహుళ దశల కరిగే ప్రక్రియే బంగారాన్ని ఒకే చోట అత్యధికంగా సాంద్రీకరించేలా చేస్తుంది.

**ఇది మొదటి అడుగే.. కానీ ఇప్పుడే తవ్వలేం!**
సముద్రాల అడుగున ఉన్న వ్యవస్థలు పసిడిని సృష్టిస్తున్నప్పటికీ.. ప్రస్తుతం కనుగొన్న నమూనాల ఆధారంగా అక్కడ వెంటనే గనుల తవ్వకాలు జరపడం సాధ్యపడదని పరిశోధకులు స్పష్టం చేశారు. వాణిజ్యపరంగా లాభదాయకంగా ఉండాలంటే రాళ్లలో ప్రస్తుతం ఉన్నదానికంటే చాలా రెట్లు ఎక్కువ పరిమాణంలో పసిడి నిల్వలు ఉండాలి. అయితే, పసిడి ఏర్పడే భూగర్భ ప్రక్రియలో ఇది అత్యంత కీలకమైన మొదటి అడుగు అని డాక్టర్ క్రిస్టియన్ టిమ్ పేర్కొన్నారు. భవిష్యత్తులో సముద్ర గర్భంలో తవ్వకాలు, బంగారం ఆధారిత ఖనిజ నిల్వల అన్వేషణకు ఈ పరిశోధన ఒక సరికొత్త మార్గాన్ని చూపనుంది.




Edited, Published and Owned by Konadoddi Naveen Kumar and Printed at Srinith Publications Falcon Printing Press #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. And Published from #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. Editor's Konadoddi Naveen Kumar, Dr.Tadhkal Rahul Kumar Reg. No.TEL-TEL/2023/12249. Email.HyderabadPulse23@gmail.com, Web:www.HyderabadPulse.com, Cell: +91-94406 53413, +91-9989834020.